

కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 25, సెప్టెంబర్ 2026 16 పేజీలు



16లో

నిబంధనలు పాటించని ఆధార్ కేంద్రాలపై కఠిన చర్యలు



పుష్కరాలే లక్ష్యం..

పనులే వేగం..!

పుష్కరాలకు ముందే పనులు పూర్తి

ఫిబ్రవరి 29లోగా కోటేశ్వరస్వామి ఆలయ పనులు పూర్తి చేయాలి

కోటిలింగాల పుష్కర ఘాట్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

రూ.117 కోట్లతో ధర్మపురి నియోజకవర్గంలో పుష్కర పనులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పిస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ప్రభాతవార్త: 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు ముందే అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు, ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో గురువారం గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు మంత్రి అడ్లూరి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణంతోపాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చేపట్టనున్న పనులకు ఈ సందర్భంగా శ్రీకారం చుట్టారు.

2లో

బెల్ట్ జోరు..

పేరుకే వైన్స్‌లు బంద్..



పల్లెల్లో ఏరులై పారిన మద్యం.!

వినాయక నిమజ్జనాల్లో జోరుగా మద్యం అమ్మకాలు

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..

గ్రామీణ ప్రజల తీవ్ర ఆగ్రహం

బీర్ పూర్ ప్రభాత వార్త. గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముగిసేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు వైన్స్ దుకాణాలకు సెలవు ప్రకటించింది. అయితే, ప్రభుత్వ ఆశయం గ్రామస్థాయిలో అట్టర్ ఫ్లాప్ అయింది. షాపులు బంద్ ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారడం విశేషం.జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో గత రెండు రోజులుగా వినాయక నిమజ్జనాలు ఘనంగా జరుగుతున్నాయి. డీజే సౌండ్లు, డప్పు చప్పుళ్ల మధ్య నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న కొంతమంది యువత మద్యం కోసం నీళ్లలా డబ్బులు ఖర్చు చేశారు. మండలంలోని 17 గ్రామాల్లో పెద్ద ఊళ్ల నుంచి చిన్న పల్లెల వరకు మద్యం దొరకని ప్రదేశమం టూ లేదనడంలో ఎలాంటి సందేహం లేదు.

2లో

అర్హుల ఇంటికే చేయూత..

సుల్తానాబాద్, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో జరుగుతున్న పెన్షన్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

పెన్షన్ దరఖాస్తులపై కలెక్టర్ నజర్.....

రేగడిమద్దికుంటలో కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ



16లో

పుష్కరాలే లక్ష్యం.. పనులే వేగం!

పుష్కరాలకు ముందే పనులు పూర్తి

ఫిబ్రవరి 29లోగా కోటేశ్వరస్వామి ఆలయ పనులు పూర్తి చేయాలి

కోటిలింగాల పుష్కర ఘాట్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

రూ.117 కోట్లతో ధర్మపురి నియోజకవర్గంలో పుష్కర పనులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పిస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, ప్రభాతవార్త: 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు ముందే అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు, ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో గురువారం గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణంతోపాటు భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చేపట్టనున్న పనులకు ఈ సందర్భంగా శ్రీకారం చుట్టారు.

బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పుష్కరాల సమయంలో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఆలయాల అభివృద్ధితోపాటు పుష్కర ఘాట్లు, రహదారులు, భక్తుల రాకపోకలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్లు

పుష్కరాల పనుల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్ల నిధులు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా పుష్కరాల అభివృద్ధి పనులకు సుమారు రూ.80 కోట్లు కేటాయించాలని కోరగా, ప్రభుత్వం స్పందించి రూ.81 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో నియోజకవర్గంలో పుష్కరాల అభివృద్ధి పనులకు మరింత ఊతం లభించిందని తెలిపారు.కోటిలింగాల ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా కోటిలింగాలలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి



రూ.16.13 కోట్లతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్లను అభివృద్ధి చేయడంతోపాటు అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరి 29లోగా పూర్తి చేయాలి

కోటిలింగాలలో శంకుస్థాపన చేసిన ఆలయ, పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను 2027 ఫిబ్రవరి 29లోగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి పనులు అసంపూర్తిగా ఉండకూడదని, ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట వేగం పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు.పుష్కరాల సమయానికి నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పనుల్లో ఎక్కడా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

గోదావరి పుష్కరాలు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యమున్న కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఘాట్ల వద్ద భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు.స్థానిక ప్రజల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి అన్నారు. పుష్కరాల సందర్భంగా కోటిలింగాల ప్రాంతానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేలా పనులు ఉండాలని పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఈ సందర్భంగా తల్లిదండ్రులు, వయోవృద్ధులు, దివ్యాంగుల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. సమాజంలోని వయోవృద్ధులు, దివ్యాంగులు, తల్లిదండ్రుల పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన

చిగురుమామిడి, ప్రభాత వార్త :

"నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం" చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామంలోని టీజీ మోడల్ స్కూల్ లో విద్యార్థినీ, విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత్ కౌర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, మిషన్ వాత్సల్య అధికారి సాదినేని రమేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ నుండి సాయికిరణ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు మత్తు పదార్థాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబంపై, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించు కోవాలని, అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని, వారికి వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా ఇతర సమాచారాన్ని ఇవ్వకూడదని సూచించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులు వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా అపరిచిత వ్యక్తులను సులభంగా నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా డ్రగ్స్, మత్తు పదార్థాలు వాటికి సంబంధించిన చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని, విద్యపై దృష్టి పెట్టి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అవగాహన కార్యక్రమం అనంతరం పోషణ మాసం కార్యక్రమంలో పోషకాహారంపై అవగాహ న పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రోమీల మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజూ సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు విద్యార్థుల ఎదుగుదలకు, ఏకాగ్రతకు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం పోషకాహారం అంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రణీత , కానిస్టేబుల్, ఉపాధ్యాయులు , అంగన్వాడీ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



బెల్ట్ జోరు.. పేరుకే వైన్స్‌లు బంద్..

పల్లెల్లో ఏరులై పారిన మద్యం.!

వినాయక నిమజ్జనాల్లో జోరుగా మద్యం అమ్మకాలు

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు..

గ్రామీణ ప్రజల తీవ్ర ఆగ్రహం

బీర్ పూర్ ప్రభాత వార్త. గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముగిసేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు వైన్స్ దుకాణాలకు సెలవు ప్రకటించింది. అయితే, ప్రభుత్వ ఆశయం గ్రామస్థాయిలో అట్టర్ ఫ్లాప్ అయింది. షాపులు బంద్ ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారడం విశేషం.జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో గత రెండు రోజులుగా వినాయక నిమజ్జనాలు ఘనంగా జరుగుతున్నాయి. డీజే సౌండ్లు, డప్పు చప్పుళ్ల మధ్య నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న కొంతమంది యువత మద్యం కోసం నీళ్లలా డబ్బులు ఖర్చు చేశారు. మండలంలోని 17 గ్రామాల్లో పెద్ద ఊళ్ల నుంచి చిన్న పల్లెల వరకు మద్యం దొరకని ప్రదేశమంటూ లేదనడంలో ఎలాంటి సందేహం లేదు.

మామూలు రోజులను మించిన బెల్ట్ షాపుల జోరు

సాధారణ రోజుల్లో మద్యం షాపులు తెరిచి ఉంటాయి కాబట్టి పరిస్థితి వేరు. కానీ వైన్స్ బంద్ అని ప్రకటించిన రెండు రోజుల్లో బెల్ట్ షాపు నిర్వాహకులు వైన్స్ దుకాణాలను తలపించేలా యథేచ్ఛగా వ్యాపారం సాగించారు. వినాయక నిమజ్జనంలో ఖిమందుబాబులుకుఖీ ఎక్కడా మద్యం కొరత రాకుండా ముందస్తుగానే భారీ స్థాయిలో స్టాక్ నిల్వ చేసుకున్నట్లు తెలుస్తోంది. మద్యం ధర ఎంత ఎక్కువగా ఉన్నా, ఎమ్మార్పీ కంటే భారీగా అధిక ధరలు వసూలు చేసినా వెనుకాడకుండా మందుబాబులు కొనుగోలు చేశారు. ఫలితంగా ఈ ఉత్సవాల్లో పల్లెల్లోనే లక్షలాది రూపాయల మద్యం అమ్మకాలు సాగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

అధికారుల పాత్రపై ప్రశ్నలు..

ఇంత పెద్ద ఎత్తున పల్లెల్లో మద్యం ప్రవహిస్తున్నా, బెల్ట్ షాపుల్లో బహిరంగంగా విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు తెలియకుండానే ఇంత భారీ స్థాయిలో మద్యం ఊళ్లలోకి వచ్చిందా? లేక తెలిసి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా? అని నిలదీస్తున్నారు.

పాత కక్షలు, గొడవలకు దారితీస్తున్న మద్యం మత్తు.

ప్రభుత్వం మంచి ఉద్దేశంతో వైన్స్ బంద్ విధించినా, గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సులువుగా లభించడంతో మత్తులో జోగుతున్న కొందరు పాత గొడవలను తవ్వి తీస్తూ, చిన్న చిన్న విషయాలకే ఘర్షణలకు దిగుతున్నారు. ఈ పరిణామాలు గ్రామీణ వాతావరణాన్ని పాడుచేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా?

మద్యం విచ్చలవిడి అమ్మకాల వల్ల యువత మత్తుకు బానిసై భవిష్యత్తులో మరిన్ని సామాజిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ మరియు సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా కట్టడి చేస్తారో, లేక ఇలాగే చూసీ చూడనట్లు వదిలేస్తారో వేచి చూడాలి.

అనారోగ్యంతో యువకుడు మృతి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

మల్యాల , ప్రభాతవార్త; మల్యాల మండలంలోని మానాల గ్రామానికి చెందిన మరాఠీ అరవింద్ (20) యువకుడు అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు, విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం రాత్రి మానాల కు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు, ఈ సందర్భంగా అరవిందు మృతికి గల కారణాలను తెలుసుకున్నారు, ఆయన వెంట మానాల గ్రామ సర్పంచ్ బలమూరి పాపారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఆనంద రెడ్డి, లక్ష్మీనారాయణ ,తిరుపతి తో పాటు పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు,



చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన కేసులో తీర్పు..

సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్

పెద్దపల్లి, ప్రభాతవార్త: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి స్వప్నరాణి గురువారం తీర్పు వెల్లడించారు. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రూప్‌నారాయణ్‌పూర్‌కు చెందిన వినోద్ మాజి (28) పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. 2024 జూన్ 13వ తేదీన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని ఒక రైస్ మిల్లులో అర్ధరాత్రి సమయంలో తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న చిన్నారిని నిందితుడు ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడటంతో పాటు హత్య చేశాడు. ఈ ఘటనపై 2024 జూన్ 14వ తేదీన మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ వేగవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్ బాధితుల తరఫున న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించి, సాక్ష్యాధారాలను సమర్పించడంలో కీలక పాత్ర పోషించారు. సాక్ష్యాధారాలను పరిశీలించి, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి స్వప్నరాణి, నిందితుడు వినోద్ మాజికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్, కోర్టు డ్యూటీ అధికారి శ్రీనివాస్, లైజన్ అధికారి కోటేష్‌లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీపీ తెలిపారు.



విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి అడ్లూరి

ఎండపల్లి ప్రభాతవార్త జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో విషాదం చోటుచేసుకుంది. వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న వాహనం విద్యుత్ తీగలకు తగలడంతో 20 ఏళ్ల యువకుడు కొప్పుల శేఖర్ విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హుటాహుటిన కొత్తపేటకు చేరుకున్నారు. శేఖర్ భౌతికకాయం వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తుండగా మంత్రి వారిని ఓదార్చి, గాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, తగిన ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలో భారీగా జనం గుమిగూడారు. పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో కొత్తపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతురాలు కుటుంబాన్ని

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శ

కొడిమ్యాల, ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఏనుగు మాధురి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న స్థానిక చొప్పదండి శాసన సభ్యులు డా. మేడిపల్లి సత్యం గురువారం రోజున మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి మాధురి భర్త రవీందర్ రెడ్డిని ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి, కొడిమ్యాల సర్పంచ్ జీవన్ రెడ్డి, ఉప సర్పంచ్ నర్సయ్య, మాజీ వైస్ ఎంపిపి ప్రసాద్, నాయకులు స్వామి, తిరుపతి రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





మతసామరస్యానికి ప్రతీక

వేలం పాటలో గణపతి లడ్డు దక్కించుకున్న ముస్లిం యువకుడు.

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త; జగిత్యాల పట్టణంలోని గోవిందు పల్లె టీం సెవెన్ యూత్ గణేష్ మండపం మతసామరస్యానికి వేదికయింది. పది రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణపతి చేతిలోని లడ్డును గురువారం మంటప నిర్వాహకులు వేలంవేయగా రూ. 70 వేలకు వేలం పాట పాడి ఒక ముస్లిం యువకుడు గణపతి లడ్డును దక్కించుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. గణేష్ నగర్ కు చెందిన ప్రముఖ గాయకుడు ఎం.డి అభి కుమారుడు మహమ్మద్ ఇషాన్ బాల్యం నుండే వినాయక చవితి నవరాత్రులను తన స్నేహితులతో కలిసి ఘనంగా నిర్వహిస్తుండేవాడు. ముస్లిం మతస్తుడు అయినప్పటికీ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గణేష్ నవరాత్రుల సమయంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడమే కాకుండా ఉపవాస దీక్షను కూడా చేపడుతుండేవాడు. ఈ ఏడు తన మిత్రులతో కలిసి గణేష్ ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా వేలం పాటలో గణేష్ లడ్డును రూ. 70 వేలకు దక్కించుకోవడం పట్ల ఇషాన్ ను పలువురు అభినందించారు. కులం, మతం పేర్లతో వైశమ్యాలు చోటు చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో కులమేదైనా, మతమేదైనా మనమంతా భారతీయులం అనే భావనతో పాటు తన మతాన్ని ఆచరించడంతోపాటు ఇతర మతాలను కూడా గౌరవిస్తాము అనే సందేశాన్ని మహమ్మద్ ఇషాన్ సమాజానికి అందించాడని ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెడ్ బుల్స్ బ్రాహ్మణ యూత్ అసోసియేషన్

ఆధ్వర్యంలో విగ్నేశ్వరునికి వీడ్కోలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో రెడ్ బుల్స్ బ్రాహ్మణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్నేశ్వర స్వామి గణపతి నిమజ్జన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు.వేద పండితులు రుద్రంగి గోపాలకృష్ణ పూజలు జరిపించి,నిర్వాహకులకు శేషవస్త్రం,తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు.లోకమంతా సుఖసంతోషాలతో, ప్రజలందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ నిమజ్జనోత్సవ శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ నుండి వచ్చిన 30 మంది కళాకారుల బ్యాండ్ మేళం అలరించింది.యూత్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.



నేరాలు-దారుణాలు

గోదావరిఖనిలో ఘోర రోడ్డు ప్రమాదం..

మాతంగి కాంప్లెక్స్ సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టిన క్రేన్..



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త: గోదావరిఖని పరిధిలోని మాతంగి కాంప్లెక్స్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బల్లం రాంచందర్ (53) అనే వ్యక్తి దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. గోదావరిఖని కాకతీయ నగర్‌కు చెందిన బల్లం రాంచందర్ డెంట్ హౌస్ వ్యాపారం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇంటిలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఫిర్యాదు చేయడానికి రాంనగర్ కరెంట్ ఆఫీస్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. మాతంగి కాంప్లెక్స్ ముందు టీఎస్02 ఈహెచ్0654 నంబరు గల క్రేన్ వాహన డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి రాంచందర్‌ను ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, గోదావరిఖనికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌ను ఎన్టీపీసీ ప్రాంతంలోని ఎల్కపెల్లికి చెందిన కానుగంటి రమేష్‌గా గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలు మరియు డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

మల్యాల వాసి ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్. ప్రభాతవార్త : మండలంలోని మల్యాల గ్రామంలో పొన్నం అంజయ్య 40 పురుగుల మందు తాగి ఆత్మహత్యకి ప్రయత్నించగా గ్రామస్తులు, పోలీసులు పురుగుల మందు తాగిన అంజయ్యను కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల మండల కేంద్రానికి చెందిన సిలివేరి మల్లమ్మ ఆవులను ఇప్పలపల్లి శివారులో మల్లమ్మ యొక్క మామిడి తోటలో కట్టివేయగా గుర్తు తెలియని వ్యక్తులు ఆవులను దొంగిలించారు. ఈ విషయంపై మల్లమ్మ ఈనెల 14న పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై కేసు నమోదు కాగా ఇటీవల పొన్నం అంజయ్యను అనుమానంతో పోలీసులు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్లో విచారణ జరపగా మల్యాల గ్రామానికి చెందిన పెద్దమనుషులు పొన్నం అంజయ్య ను పోలీస్ స్టేషన్ నుంచి తీసుకు వెళ్లారు. విచారణ నిమిత్తం అంజయ్య పోలీస్ స్టేషన్ కు తీసుకురమ్మని పలుమార్లు చెప్పిన రాకపోవడంతో గురువారంపెద్దమనుషులకు సమాచారమిచ్చి పోలీసులు మల్యాల కు రావడంతో పోలీసులు వచ్చిన విషయం గమనించి తన ఇంటి వద్ద అంజయ్య పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు, పోలీసులు తెలుసుకొని వెంటనే అంజయ్య ను మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ద పెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. .

రైలు పట్టాలు దాటుతూ మహిళా మృతి



అంతర్గాం, ప్రభాతవార్త : అంతర్గాం మండల పరిధిలోని బద్రిపల్లి వద్ద గూడ్స్ రైలు కింది నుండి పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కదలడంతో రైలు కింద పడి నాంసాని లక్ష్మీ 56 అనే మహిళా మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రామగుండం ఎస్. ఐ. సంధ్యా రాణి, బద్రిపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం మృతురాలు లక్ష్మీ తాను గ్రామంలో నిర్మించుకుంటున్న ఇంటి నుండి అదే గ్రామంలో ప్రస్తుతం అద్దెకు ఉంటున్న ఇంటికి వెళుతూ అదే సమ యంలో పట్టాలపై ఆగి ఉన్న రైలు కింది నుండి దాటుతుండగా రైలు మృతురాలిని ఈడ్చుకుంటూ వెళ్ళగా గాయలపాలై లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త నాంసాని అంజయ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న రామగుండం పోలీస్ లు శవ పంచనమా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి తరలించారు. మృతురాలి భర్త అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్. ఐ. సంధ్యా రాణి తెలిపారు. ఇక్కడ రైల్వే గేటు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా ఇక్కడ రైళ్లు గంటల తరబడి ఆగి ఉంటు న్న నేపథ్యంలో పట్టాలు దాటుతున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతు న్నాయి. ఇక్కడ కనీసం ఫూట్ ఓవర్ బ్రిడ్జి నైనా నిర్మించి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు వ్యవసాయ పంట వివరాలను నమోదు చేసుకోవాలి

కోరుట్ల పట్టణ బిజెపి అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ

కోరుట్ల, ప్రభాతవార్త :



ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల పట్టణ బిజెపి అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందేందుకుగాను రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీతో పాటు వ్యవసాయ పంటల నమోదు వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలను పూర్తి చేసేందుకు అగ్రికల్చరల్ అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. రైతుల వివరాలు, పంటల నమోదు స్థితిగతులపై వ్యవసాయ శాఖకు చెందిన ఏడిఏలు, ఏవోలు, ఏఈఓలు గ్రామస్థాయిలో అవగాహన సదస్సులను నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్ ను సంబంధిత వ్యవసాయ గ్రామ ఏఈఓలకు పంపి అన్ని వివరాలను పూర్తిగా ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు.

వ్యర్థాలతో విలువైన వస్తువుల తయారీపై విద్యార్థులకు అవగాహన

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :

కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా–2026 కార్యక్రమంచేపట్టారు.





ఈ సందర్భంగా విద్యార్థులకు "వేస్ట్ టు వెల్త్", వ్యర్థ పదార్థాలను ఉపయోగించి పునర్వినియోగ వస్తువుల తయారీ, అలాగే నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడంపై అవగాహన కల్పించారు. వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, పునర్వినియోగం ద్వారా విలువైన వస్తువులను తయారు చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణకు కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణపై క్విజ్ పోటీ నిర్వహించారు. పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబినెట్ మీటింగ్లో క్లారిటీ ఇవ్వాలి

పాలిటెక్నిక్ జెఏసి చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ డిమాండ్

కోరుట్ల, ప్రభాతవార్త :



జీవో 97 లో పేర్కొన్న ప్రకారం పాలిటెక్నిక్ వ్యవస్థకు సంబంధించి గత నెల ఆగస్టు 14వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాలిటెక్నిక్ వ్యవస్థను విద్యాచట్టం పరిధి నుండి తొలగించి స్కిల్ యూనివర్సిటీ (పీపీపీ) చట్టం పరిధిలో చేర్చడానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపాలని తెలంగాణ పాలిటెక్నిక్ జెఏసి రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ అన్నారు. గురువారం కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజన విరామ సమయంలో ప్లకార్డుల ప్రదర్శనద్వారా జీవో 97 కి సవరణ జీవో త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తమ శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ మాట్లాడుతూగత కేబినెట్ మీటింగ్ తరువాత 40 రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు కొనసాగించిన ఉధృత నిరసన కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రప్రభుత్వం హై లెవల్ కమిటీ ఏర్పాటు చేసి పాలిటెక్నిక్ వ్యవస్థలో భాగస్వాములతో అభిప్రాయ సేకరణలు నిర్వహించిందని, హై లెవల్ కమిటీ రిపోర్టు అందించినా ప్రభుత్వం నుండి నేటికీ స్పష్టమైన సవరణ జీవో వెలువడలేదన్నారు. హై లెవల్ కమిటీ ప్రభుత్వానికి అందజేసిన నివేదికను పాలిటెక్నిక్ వ్యవస్థ భాగస్వాములకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేసారు. అక్టోబర్ 1న నిర్వహించనున్న తదుపరి కేబినెట్ మీటింగ్లో పాలిటెక్నిక్ వ్యవస్థను విద్యాచట్టం పరిధిలోనే కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. పాలిటెక్నిక్ వ్యవస్థ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 97కి సవరణ జీవో / స్పష్టమైన అధికారిక ధృవీకృత ప్రకటన అక్టోబర్ 1లోపు వెలువరించనియెడల, అక్టోబర్ 2 నుండి పాలిటెక్నిక్ వ్యవస్థ పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం

కోరుట్ల ఐసీడీఎస్ సూపర్ వైజర్ భారతి

కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :

సమతూల్య ఆహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల్లో శారీరక, మానసిక



ఎదుగుదల మెరుగుపడటంతో పాటు పోషకాహార లోపాన్ని నివారించవచ్చని కోరుట్ల అంగన్వాడీ సూపర్వైజర్ భారతి అన్నారు. జాతీయ పోషక మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్ 1,2 అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరానికి అవసరమైన వివిధ రకాల పోషకాలు అందేలా రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, పాలు లాంటి పోషక పదార్థాలను తీసుకోవాలన్నారు. చిన్నారుల ఎదుగుదల దశలో పోషకాహారం ఎంతో కీలకమని, సరైన పోషకాలు అందకపోతే శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసంపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సునీత, స్వప్న అంగన్వాడీ హెల్పర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

స్కూల్ డ్రెస్ లు వితరణ

ముస్తాబాద్ ప్రభాత వార్త:

పోతుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మామిండ్ల భూపతి ఆధ్వర్యములోవిద్యార్థులకు దాదాపు 80వేల రూపాయల విలువ గల 190 డ్రెస్ లు పూర్వ విద్యార్థుల సౌజన్యంతో ఉచితంగా గురువారం పంపిణి చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ,శ్రీనివాస్,మండల విద్యాధికారి అంబటి రవీందర్,ఉపసర్పంచ్ కోల కృష్ణ,వార్డు మెంబెర్ జంగ రాజు,యూత్ లీడర్ వరి వెంకటేష్,ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



చిన్న వర్షానికే జలమయమైన ప్రధాన దారి

మున్నూరు కాపు, గంగపుత్ర, ఎస్సీ కాలనీల ప్రజలకు తప్పని అవస్థలు

భీమారం, ప్రభాతవార్త :

భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని మున్నూరు కాపు, గంగపుత్ర, ఎస్సీ కాలనీలకు వెళ్లే ప్రధాన దారి చిన్నపాటి వర్షానికే జలమయంగా మారింది. గురువారం రాత్రి కురిసిన వర్షంతో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



ఈ మార్గం ద్వారా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారిపై నీరు నిలవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ రహదారి దాటాల్సి వచ్చింది. గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక వైద్య కేంద్రానికి వెళ్లే వృద్ధులు కూడా నీటిలోంచి నడుచుకుంటూ వెళ్లాల్సి ఉండగా, వర్షం కురిసిన ప్రతిసారీ ఈ ప్రాంతంలో నీరు నిలుస్తుండటంతో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. పాలకవర్గాలు మారినా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని,ప్రధానంగా వర్షపు నీరు నిలవకుండా సరైన డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు రహదారి పరిస్థితిని అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యపై పాలకవర్గం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ వినాయక నిమజ్జనం

కోరుట్ల, ప్రభాతవార్త :





పట్టణంలోని భీమునిదుబ్బ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని గురువారం నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం నుండి వార్డుకు చెందిన మహిళలంతా పెద్ద ఎత్తున వినాయకుని ముందు కోలాటాలతో శోభాయాత్ర చేపట్టారు. ఈ శోభాయాత్రను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రైతులు, ప్రజలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు

రూ. 13 కోట్ల 51 లక్షల 59 వేలతో సబ్ స్టేషన్ల ఏర్పాటు..

రానున్న వేసవికాలం నాటికి అందుబాటులోకి వస్తాయని వెల్లడి

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి నియోజకవర్గంలోని రైతులకు, ప్రజలకు సమృద్ధిగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా కోట్లాది రూపాయలతో సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి నియోజకవర్గంలో మరో 4 33/11 కేవీ సబ్ స్టేషన్ల నూతన నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకు గాను 13 కోట్ల 51 లక్షల 59 వేల రూపాయలు వెచ్చిస్తున్నామని అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పెద్దరాజుపల్లిలో 2 కోట్ల 44 లక్షల 83 వేల రూపాయలతో నూతన సబ్ స్టేషన్ నిర్మాణం



చేపడుతున్నామని, అలాగే సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శాస్త్రి నగర్ లో 2 కోట్ల 47 లక్షల 56 వేల రూపాయలతో, ఓదెల మండలం రూప్ నారాయణపేటలో 4 కోట్ల 14 లక్షల 90 వేల రూపాయలతో, ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో 4 కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలతో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టి నిరంతరం విద్యుత్ అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి విద్యుత్ కోతలు ఉండవద్దనే ఉద్దేశంతోనే ఈ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రానున్న వేసవికాలం వరకు పూర్తిస్థాయిలో సబ్ స్టేషన్లు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. సబ్ స్టేషన్లను మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కలతోపాటు జిల్లా మంత్రి శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు.

కరెంటు సంక్షోభానికి
సింగరేణిని బలిచేస్తున్నారా?

బకాయిలు చెల్లించాలి.. బొగ్గు ఉత్పత్తి పెంచాలి

విద్యుత్ కోతలు ఆపాలి.. డైరెక్టర్‌కు వినతి

గోదావరిఖని,ప్రభాతవార్త: సింగరేణి భవన్ వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో విద్యుత్ కోతలు, సింగరేణి బొగ్గు ఉత్పత్తి, రాష్ట్ర ప్రభుత్వ బకాయిల అంశాలపై బీఆర్ఎస్-టీబీజీకేఎస్ నేతలు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపు మేరకు మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు సింగరేణి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులను కలిసి విద్యుత్ రంగంలోని పరిస్థితులపై ప్రశ్నించారు. అనంతరం డైరెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

బకాయిలే కారణమని ఆరోపణ

ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వ్యవసాయ రంగంపై విద్యుత్ కోతల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.52 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటిని విడుదల చేయకపోవడం వల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు.

ఉత్పత్తి తగ్గిందని విమర్శ

థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన మేరకు సింగరేణి నుంచి బొగ్గు సరఫరా జరగడం లేదని, దీంతో విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని నేతలు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తి



72 లక్షల మెట్రిక్ టన్నుల స్థాయిలో ఉండగా ప్రస్తుతం 58 లక్షల టన్నులకు పడిపోయిందని పేర్కొన్నారు. ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన పనిముట్లు, యంత్రాల కొనుగోలుకు కూడా సంస్థ వద్ద తగినన్ని నిధులు లేకపోవడం సమస్యను మరింత తీవ్రం చేసిందన్నారు.

పవర్ హాలిడేపై ఆందోళన

పరిశ్రమలకు ఇప్పటికే విద్యుత్ పరిమితులు విధించారని, రానున్న యాసంగి, వేసవి పంటల సమయంలో వ్యవసాయ విద్యుత్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. గతంలో రైతులకు నిరంతర విద్యుత్ అందించామని, ప్రస్తుతం కనీసం ఆరు గంటలు కూడా విద్యుత్ అందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. అయితే విద్యుత్ సరఫరా, బొగ్గు లభ్యతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం అధికారికంగా వెల్లడించే గణాంకాలతోనే వాస్తవ పరిస్థితిని నిర్ధారించాల్సి ఉంది. కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తదితరులతోపాటు రామగుండం ప్రాంతానికి చెందిన టీబీజీకేఎస్ నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, జాహిద్ షా, చెల్పూరి సతీష్, పొలారి శ్రీనివాసరావు, మొదంపల్లి రాజేశం, దూట శేషగిరి, ఉప్పులేటి తిరుపతి, అప్సర్ పాషా, రహమాన్, వివిధ ఏరియాల నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరగాలి...

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన

ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, చైర్‌పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: వినాయక నవరాత్రుల సందర్భంగా జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద కొనసాగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చిన గణనాథులను చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అధికారులు చేపట్టిన ఏర్పాట్లను వారు పరిశీలించారు.ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 700కు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించి తొమ్మిది రోజుల పాటు ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మున్సిపాలిటీ, పోలీస్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారని అభినందించారు. జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణంలోని ప్రతి వార్డు అభివృద్ధికి రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ చింతకుంట చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి



వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టి అవసరమైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా జరిగేలా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి రాబోయే రోజుల్లో పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా ప్రజలు ముందుకు రావాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కో ఆప్షన్ సభ్యులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





సేవాభావంతో సమాజానికి అండగా నిలవాలి

గోదావరిఖని, ప్రభాతవార్త: చదువుతో పాటు సమాజంపై బాధ్యతను పెంచుకోవాలని.. మారుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వై.ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు క్రమశిక్షణ, సేవాభావంతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. వ్యక్తిత్వ వికాసంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి, అధ్యాపకులు డాక్టర్ సుధ, డాక్టర్ అంబిక, డాక్టర్ రఘుపతి, డాక్టర్ అనిల్, శ్యామ్ ప్రసాద్, జ్యోతి, డాక్టర్ సతీష్, రవీందర్, ఎం.కామ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత, పోక్సో కేసులు లేని జిల్లాగా మార్చాలి

అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:బాల్య వివాహ రహిత,పోక్సో కేసులు లేని జిల్లాగా మార్చాలనీ అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్ పేర్కొన్నారు.



జగిత్యాలలోని ఐడీవోసీ భవనంలో జిల్లా సంక్షేమ శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆడేపు భాస్కర్ ఆధ్వర్యంలో, అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా 202627 సంవత్సరానికి గాను మిషన్ వాత్సల్య కింద బాల్య వివాహాల నిరోధక చట్టం2006,పోక్సో చట్టం2012ల పటిష్ట అమలు కోసం జిల్లా స్థాయి వార్షిక కార్యాచరణ ప్రణాళికను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు రూపొందిం చిన ఈ యాక్షన్ ప్లాన్‌ను ప్రతి మండలం,గ్రామంలో నెలవారీ ప్రాతిపదికన పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. విద్యా,పంచాయతీ రాజ్,ౌవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖల సమన్వయంతో పనిచేసి జగిత్యాల జిల్లాను పూర్తిగా బాల్య వివాహ రహిత,పోక్సో కేసులు లేని జిల్లాగా మార్చాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి,జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుజాత, డీసీపీఓ సురేష్, విద్యాశాఖ కోఆర్డినేటర్ మహేష్,సీడీపీఓలు వీరలక్ష్మిమి, జయప్రద, వాణిశ్రీ, పద్మ,జిల్లా సంక్షేమ సమితి సభ్యులు,బాలల పరిరక్షణ, మహిళా సాధికారత, సఖి, భరోసా కేంద్రాల అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనేరుపల్లి గ్రామంలో స్వచ్ఛత హిసేవజన్‌బాగ్ దారి కార్యక్రమం

చొప్పదండి,ప్రభాతవార్త: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం కోనేరుపల్లి గ్రామంలో సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐకెపి ఎ పి ఎం వాణిశ్రీ, వార్డు సభ్యులు నరేందర్, మమత, నరేష్, కార్యదర్శి శ్రీనివాస్, మహిళ సంఘాల సభ్యులు అధిక సంఖ్య లో గ్రామ ప్రజలు భాగస్వామ్యులు అయ్యారు.



లలిత కళా సమితి స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలి

కళాకారులు, డివిజన్ సాధన సమితి నాయకులు

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ పార్కులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గురువారం మెట్పల్లి డివిజన్ సాధన సమితి, జగిత్యాల జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక, లలిత కళా సమితి, మెట్పల్లి పాత తాలూకా ప్రాంత కళాకారులు సంయుక్తంగా వినతిపత్రం సమర్పించారు. మెట్పల్లి కళా వైభవానికి వారసత్వ సంపదగా ఉన్న లలిత కళా సమితి స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలని వారు కోరారు. ఈ సందర్భంగా డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు తోకల సత్యనారాయణ మాట్లాడుతూ.. అంబేద్కర్ మహాశయుడు ఇచ్చిన "బోధించు.. సమీకరించు.. పోరాడు" అనే నినాద స్ఫూర్తితో శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. లలిత కళా సమితి స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడేందుకు సంబంధిత అధికారులను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలు, బాధ్యతలను అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తాకట్టు పెట్టకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని



కోరారు. లలిత కళా సమితి స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు ఉంటే వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ సాధన సమితి నాయకులు బర్ల సాయన్న, నాంపల్లి గట్టయ్య, ఇల్లెందుల కృష్ణమాచారి, కొండ్లేపు శ్రీనివాస్, కలిగోట లక్ష్మణ్, సంకు అశోక్, శేఖర్, లింగం, లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కోటగిరి చైతన్య, డీఎల్ఎన్ వర్మ, నాగభూషణ్, నారాయణ, క్రాంతికుమార్, వికీ, రవి తదితర కవులు, కళాకారులు పాల్గొన్నారు.

మెట్ పల్లి లో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

మెట్ పల్లి పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఆలస్యంగా గురువారం తెల్లవారుజామున నుండి ఉదయం వరకు గణేష్ నిమజ్జనం జరిగింది. కాగా గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేందుకు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెట్ పల్లి సి ఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో మెట్ పల్లి,మల్లాపూర్, ఇబ్రహీంపట్నం ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, నవీన్ ల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనం కోసం జిల్లా కలెక్టర్ జి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ ఇరువురి ఆదేశాలు, సూచనల మేరకు మెట్‌పల్లి పట్టణంలోని ఆరపేట, వట్టి వాగు వద్ద నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్ లు గురువారం తెలిపారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు సహకరించిన ఆర్డీఓ, డీఎస్పీ, తహసీల్దార్, సీఐ, ఎస్ఐలతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి చైర్మన్





మైలారపు లింబాద్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోలీస్, ఫైర్, ఫిషరీస్, ఎస్సారెస్పీ ఇంజినీరింగ్, విద్యుత్, వైద్య శాఖల అధికారులు, సిబ్బందికి మున్సిపల్ పాలకవర్గం తరఫున ధన్యవాదాలు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులకు సహకరించిన పట్టణ ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రజలు భవిష్యత్తులో మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మరోసారి విజ్ఞప్తి చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

కమలాపూర్ మండల వ్యాప్తంగా ఘనంగా గణేష్ నిమజ్జన మహోత్సవం

కమలాపూర్: ప్రభాత వార్త

కమలాపూర్ మండల వ్యాప్తంగా గణేష్ నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు గణనాథుల విగ్రహాలను అందంగా అలంకరించి, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ముఖ్యంగా గూడూరు గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. భజన మండలి సభ్యులు, యువకులు ప్రత్యేక లైటింగ్, విద్యుత్ మెరుపులతో మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. డీజే సంగీతం, మంత్రోచ్చారణలు, నృత్యాల నడుమ అలంకరించిన వాహనాల్లో గణపతి విగ్రహాలను ఊరేగించారు. అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా నిమజ్జనం:నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పర్యవేక్షించింది. మండల తహశీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ శాఖ అధికారులు ముందస్తుగా నిమజ్జన ప్రాంతాలైన చెరువులు, వాగుల వద్ద బారికేడ్లు, లైటింగ్, సౌకర్యం కల్పించారు. పోలీసు సిబ్బంది ఊరేగింపు వెంట ఉండి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడంతో పాటు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. విద్యుత్, వైద్య, పంచాయతీ శాఖల సమన్వయంతో వేడుకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.



అధికారుల ఈ సమిష్టి కృషి వల్ల మండల వ్యాప్తంగా నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంతరాలు లేకుండా భక్తిపూర్వక వాతావరణంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గణేష్ లడ్డూలను భక్తులకు వేలం వేశారు. మహిళలు కోలాటం వంటి సంప్రదాయ నృత్యాలతో అలరించగా, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు..

వెల్లివిరిసిన మతసామరస్యం..

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలంలో గతంలో కంటే ఈ యేడు గ్రామ గ్రామాన గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసి, నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పిల్లాపాపలతో పవిత్రంగా పూజించారు. తొమ్మిది రాత్రులు గడిపి పదోవరోజులో అడుగు పెట్టడంతో గ్రామాలలో కుల మతాలకు అతీతంగా పెద్దలు, చిన్నలు భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజలు నిర్వహించారు. పులిహోర, పాయసాలు ఇతర ప్రసాదాలు తయారుచేసి మండపాల నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన వారి ఇండ్లకు వెళ్లి ప్రసాదాలు అందించారు. అనంతరం పలు గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు గణనాథున్ని చెరువుల్లో కుంటల్లో కాలువల్లో నిమజ్జనాలు నిర్వహించారు. భారత దేశం నిజమైన లౌకిక ప్రజాస్వామ్య దేశం అని మతసామరస్యానికి నిలువెత్తు దర్పణం అని ఓ ముస్లిం భక్తుడు లడ్డువేలం పాటలో పాల్గొని 3116 రూపాయలకు సొంతం చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం రాచపల్లి గ్రామంలో ఒక్కసారిగా మతసామరస్యం వెల్లివెరిసింది. పూర్తి వివరాలకు వెళ్తే.. ఇల్లంతకుంట మండలం రాచపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని మంటపంలో నవరాత్రులు పూజించిన ఐదు కిలోల లడ్డును ఉత్సవ కమిటీ వేలంపాట పాడగా ఇదే గ్రామానికి చెందిన ఎండి అక్బర్ అందరితోపాటు వేలంపాటలో పాల్గొని చివరకు 3116 రూపాయలకు దక్కించుకొని మతసామరస్యాన్ని ప్రదర్శించారు. అక్బర్ చేసిన మంచి పనికి హిందూ, ముస్లిం సంతోషాన్ని



పంచుకోవడం మతసామరస్యానికి ప్రతిగా నిలిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా గ్రామంలో హిందువులు ముస్లింలు అని బేదాభిప్రాయం లేవని అందరం కలిసి మెలిసి అన్ని పండుగలు నిర్వహించుకుంటామన్నారు. మండలంలోని వేలాదిమంది అక్బర్ చేసిన పనికి హర్షం వ్యక్తం చేస్తున్నారు

మెట్‌పల్లి వార్త



పౌల్ట్రీ రైతుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

జగిత్యాల జిల్లా పౌల్ట్రీ రైతుల యూనియన్ నూతన అధ్యక్షుడు నవీన్ రెడ్డి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



పౌల్ట్రీ రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని జిల్లా పౌల్ట్రీ రైతుల యూనియన్ నూతన అధ్యక్షుడు నవీన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పౌల్ట్రీ రైతుల యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పౌల్ట్రీ రైతుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, రంగం అభివృద్ధి కోసం యూనియన్ తరఫున నిరంతరం పనిచేస్తానని నవీన్ రెడ్డి తెలిపారు.

పౌష్టికాహారం పై వ్యాస రచన పోటీ

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త:



మండలంలోని వెల్లుల్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషన్ మహ్ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పౌష్టికాహారం పై వ్యాస రచన,క్విజ్ పోటీలు అంగన్వాడీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత,త్రాగునీరు ఆవశ్యకత, పౌష్టికాహారం గూర్చి ఐసిడీఎస్ సూపర్వైజర్ షమీమ్ సుల్తానా అవగాహన కల్పించారు. అలాగే పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, లావణ్య, రాధిక, ఉమ, నీరజ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి

నేతన్నల సమస్యల పరిష్కారానికి

సీఎం సభను వేదికగా

చేసుకుందాం

వర్కర్ టు ఓనర్ పథకాన్ని సీఎం

దృష్టికి తీసుకెళ్దాం

రైతులు యువత కార్మికులతో

కలిసి సీఎం మూడు కిలోమీటర్ల

మేర పాదయాత్ర

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను కార్మికులు, నేతన్నలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో చేనేత మరియు జౌళి కార్యాలయంలో చేనేత కార్మికులు, అసాములు,యజమానులతో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రతి ఒక్కరూ చేరుకోవాలని, అక్కడి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి సభా ప్రాంగణం వరకు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకున్న అనంతరం కార్మికులు, రైతులు, యువత మధ్య నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్రగా సభా ప్రాంగణానికి వెళ్లనున్నారని తెలిపారు.కార్మిక సంఘాల నాయకులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించాలని, ముఖ్యమంత్రి సభకు వెళ్లే సమయంలోనే వినతిపత్రాలను సమర్పించేలా కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్లలోని నేత కార్మికులు, టెక్స్‌టైల్ రంగ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది తదితర రంగాల్లో పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించిన షెడ్లను కార్మికులకు అందించాలనే డిమాండ్‌ను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. సిరిసిల్లలో సుమారు 5,600 నుంచి 6,000 మంది కార్మికులు ఉన్నారని, ప్రస్తుతం ఉన్న షెడ్లను దశలవారీగా మరింత మంది కార్మికులకు అందించే అంశాన్ని పరిశీలించాలని గతంలో చర్చించిన విషయాన్ని గుర్తుచేశారు.అదేవిధంగా సిరిసిల్ల నియోజక వర్గానికి సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని వెల్లడించారు. సుమారు 2,500 మంది పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా ఈ పాఠశాల రూపుదిద్దుకోనుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఇది రెండో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అని పేర్కొన్నారు.చేనేత కార్మికులకు నిరంతరం పని కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆది శ్రీనివాస్ అన్నారు. గత ఏడాది 6.96 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు అందించామని, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 4.66 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. మరో 2 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు త్వరలో ఇవ్వనున్నట్లు చెప్పారు. తద్వారా నేతన్నలకు చేతినిండా పని కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సెప్టెంబర్ 30న సిరిసిల్లలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ కేవలం రాజకీయ కార్యక్రమం మాత్రమే కాకుండా జిల్లాలోని కార్మికులు, నేతన్నలు, పేదలు, రైతులు, యువత తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఉపయోగించుకోవాలని ఆది శ్రీనివాస్ కోరారు.సిరిసిల్ల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విప్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ మహేందర్ రెడ్డి ,జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు , మాజీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, గోలి వెంకటరమణ, ఎల్లె లక్ష్మీనారాయణ , నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త



నాణ్యమైన విద్యకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్లు

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల కి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

సిరిసిల్ల కి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా 200 కోట్లతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సిరిసిల్ల కి మంజూరు చేయడం జరిగిందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్ ల్యాబొరేటరీలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ సదుపాయాలు, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు . చదువుతో పాటు విద్యార్థులలో సృజనాత్మకత, నైపుణ్యాలు, క్రీడా ప్రతిభను పెంపొందించేలా విద్యా విధానాన్ని రూపొందిస్తుందన్నారు .ఈ పాఠశాలల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు సమానమైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 200 కోట్లతో సిరిసిల్ల కు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి లు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగును పెంచాలి

జిల్లాలో ఎరువులకు కొరత లేదు

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యం

చేరుకోవాలి

క్రాప్ బుకింగ్ లో వేగం పెంచాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



వ్యవసాయ శాఖ అధికారులు క్రాప్ బుకింగ్ లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. క్రాప్ బుకింగ్, ఎరువుల సరఫరా, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పీఏసీ ఎస్ సెక్రటరీలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, మార్క్ ఫెడ్ అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు క్రాప్ బుకింగ్ 56 శాతం పూర్తి అయిందని, మిగతా బుకింగ్ ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ.. పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.

23వేల మెట్రిక్ టన్నులు సరఫరా....

జిల్లాలో వివిధ పంటల సాగు కోసం వ్యవసాయ శాఖ అంచనాల మేరకు మొత్తం 21,000 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి వరకు 23 వేల టన్నులు విక్రయాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇంకా రెండు వేల టన్నుల ఎరువులు నిలువ ఉన్నాయని, జిల్లాలో ఎరువులకు కొరత లేదని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు.

ఆయిల్ పామ్ సాగువైపు ప్రోత్సహించాలి...

ఆయిల్ పామ్ తో వచ్చే లాభాలు, ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పిస్తూ సాగు వైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఆయిల్ పామ్ మద్దతు ధర, దిగుబడి రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండాలని ఉద్యాన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయిల్ పామ్ టన్ను ధర ప్రస్తుతం రూ. 24025 ఉందని వెల్లడించారు. రైతుల నుంచి ప్లాంట్, డ్రిప్ డీడీలు తీసుకుని సాగు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఆయిల్ పామ్ దిగుబడి వస్తుందని, జిల్లాకు సమీపంలోనే ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రైతులను ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు.

లాభాలు వివరించాలి....

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, పీ ఏ సీ ఎస్ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు ధాన్యాలు, ఇతర పంటలు సాగు చేసేలా .. లాభాలు వివరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఆర్.శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి అష్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం

గర్భిణులకు సీమంతాల నిర్వహణ

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిస్తారని ఏసీడీపీవో ఉమారాణి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ సాహితి పేర్కొన్నారు. స్థానిక 35వ వార్డు పరిధిలోని సుందరయ్యనగర్2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఖిపోషణ మాసంఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బత్తుల రమేశ్‌తో కలిసి గర్భిణులకు ఘనంగా సీమంతాలు జరిపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకుకూరలు, తాజా కూరగాయలతో కూడిన బలవర్ధకమైన ఆహారం తల్లీబిడ్డలకు రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందించే అదనపు పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్ననాటి నుంచే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం ద్వారా వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వప్న, సఖి కేంద్రం కోఆర్డినేటర్ రోజా, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీరామోజీ లలిత, పబ్లిక్ హెల్త్ మేనేజర్ బి.వాణి, ఏఎన్ఎం రేణుక, ఆశా కార్యకర్త పుష్ప, ఆర్పీలు భాగ్యలక్ష్మి ,మానస, రేష్మతో పాటు బాలింతలు, గర్భిణులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



రైతును గుర్తించేందుకు రిజిస్ట్రేషన్ ఎందుకు?

పంట పండించడం ఒక పరీక్ష.. అమ్ముకోవడం మరో పరీక్ష"

మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

సారంగాపూర్ ప్రభాత వార్త : రైతు పంట పండించాలి.. ప్రభుత్వం కొనుగోలు చేయాలి.. రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఇది రైతు అడిగే ఉపకారం కాదని, రైతుకు దక్కాల్సిన హక్కు అని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు.సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు ఇప్పటికే పంట పండించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట చేతికి వచ్చిన తర్వాత దానిని అమ్ముకోవడానికి మరోసారి ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు.రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకురావడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. పంటలు పండించేందుకు నీరు, విద్యుత్ సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పంట విక్రయాల విషయంలో యాప్‌లపై ఆధారపడే పరిస్థితి తీసుకురావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులపై ఆంక్షలు విధిస్తున్నాయని ఆమె ఆరోపించారు. రైతు పండించిన పంటను గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టే నిబంధనలు, యాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని దావ వసంత సురేష్ ఆరోపించారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ అందించినట్లు పేర్కొంటూ, ప్రస్తుతం రైతులకు సమయానికి విద్యుత్ అందడం లేదని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ తగిన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.మూడు సంవత్సరాలకు సంబంధించిన ఆరు పంటల బోనస్‌ను రైతులకు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ఫసల్ బీమా విధివిధానాలను రూపొందించాలని అన్నారు.గతంలో రైతులకు అవసరమైన యూరియాను సులభంగా అందించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం రైతులు ఎరువుల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.రైతులను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని దావ వసంత సురేష్ హెచ్చరించారు. రైతులు బాగుంటేనే అన్ని వర్గాలు బాగుంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, నాయకులు రాంచందర్ రెడ్డి, చిరంజీవి, జగన్, మదన్, రమేష్, రాజన్న, రాయమల్లు, ప్రభాకర్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, మల్లయ్య, మహేష్, సుంకం రమేష్, ఆనందరెడ్డి, రాజు, తిరుపతి, శ్రీనివాస్, శ్రీను, నరసింహారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.





విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: వినాయక నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా వినాయకుడికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు. జగిత్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల శ్రీ సావిత్రిబాయి పూలే పార్కులో జగిత్యాల టైగర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులు ప్రజలం దరిపై ఉండాలని, జగిత్యాల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కే.జీ.బీ.వీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

విద్యార్థినులతో ముఖాముఖి – విద్యా బోధన, భోజన వసతులపై ఆరా

బీర్ పూర్ ప్రభాత వార్త.జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం బీర్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది మరియు విద్యార్థినుల వసతి గృహాన్ని (హాస్టల్) ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి, వారికి అందుతున్న విద్యా బోధన, మెనూ ప్రకారం లభిస్తున్న భోజనం మరియు ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నిబంధనల ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రస్తుత కేజీబీవీ భవనంలో ఉన్న అసౌకర్యాల దృష్ట్యా, విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదిత ఎం.పీ.పీ.ఎస్ డీ.పీ.ఈ.పీ బీర్ పూర్ పాఠశాల భవనాన్ని పరిశీలించాలని స్థానిక అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల ఆర్.డీ.ఓ మధుసూదన్ వెంటనే సదరు పాఠశాల భవనాన్ని, అక్కడి వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేజీబీవీ మార్పిడికి అనుకూలంగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీ మరియు భవన పరిశీలన కార్యక్రమాల్లో ఆర్‌డీఓ మధుసూదన్‌తో పాటు కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, సత్యనారాయణ, తహశీల్దార్ సుజాత, ఎంఈఓ నాగభూషణం, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ శ్రీనివాస్, రెవెన్యూ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పీ.ఎం.శ్రీ పాఠశాలలో
ఐసీటీ కంప్యూటర్లు ప్రారంభం

డిజిటల్ విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు: గ్రామ సర్పంచ్

ఎలమట్ల హరీష్, ఎంఈఓ నాగభూషణం

బీర్ పూర్ ప్రభాత వార్త. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, మండల విద్యాధికారి సిరుప నాగభూషణం పేర్కొన్నారు. గురువారం రోజున పీఎం శ్రీ ఎంపీపీఎస్ బీర్పూర్ ప్రాథమిక పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద మంజూరైన 4 కంప్యూటర్లు, 8 హెడ్‌సెట్లతో కూడిన ఐసీటీ కంప్యూటర్ ల్యాబ్‌ను వారు ముఖ్య అతిథులుగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ ఎలమట్ల హరీష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆకాంక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. తదనంతరం ఎంఈఓ సిరుప నాగభూషణం మాట్లాడుతూ.. ఈ ఐసీటీ కంప్యూటర్లు ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లో భాగంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన, సామర్థ్యాలు పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ.. "పీఎం శ్రీ పథకంలో భాగంగా మన పాఠశాలకు ఐసీటీ కంప్యూటర్లు రావడం విద్యార్థులకు లభించిన ఒక గొప్ప వరం. టైమ్‌టేబుల్ ప్రకారం విద్యార్థులకు బోధన అందించడానికి ప్రత్యేకంగా ఐసీటీ ఇన్స్ట్రక్టర్‌ను కూడా నియమించాం. డిజిటల్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులు డ్రాయింగ్, టైపింగ్ నేర్చుకోవడంతో పాటు భాషా, గణిత నైపుణ్యాలను అత్యంత ఉత్సాహంగా, వేగంగా గ్రహించగలరు" అని వెల్లడించారు. ప్రతిరోజు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనుగంటి జితేందర్ గౌడ్, బీర్పూర్ కాంప్లెక్స్ హెచ్ఎం చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సముద్రాల శ్రీలత, వార్డు మెంబర్లు మంద సుభాష్, జువ్వికింది భూమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, బాణావత్ స్వరూప, ఐసీటీ ఇన్స్ట్రక్టర్ చిక్కుల శ్రీకాంత్, షేక్ రజియా, కందుకూరి లలిత, గంగివల్లి మౌనిక, గంధం ప్రియతో పాటు విద్యార్థులు,పాల్గొన్నారు.



జగిత్యాల వార్త



ఘనంగా పోషణ్ మాసం వేడుకలు...

చిన్నారులకు పౌష్టికాహారమే ప్రాణాధారం..

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ

బీర్ పూర్ ప్రభాత వార్త. జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం చిన్న కోల్వాయి గ్రామంలో పోషణ మాసం షెడ్యూల్లో భాగంగా స్థానిక అంగన్వాడి కేంద్రాలలో పోషణ్ మాసం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా "పోషణ్ మాసం" కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, పిల్లలకు ఇంట్లోనే తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ ఐ.సి.డి.ఎస్ సూపర్ వైజర్ శ్రీమతి ఎస్. సువర్ణ పిలుపునిచ్చారు. పిల్లల ఎదుగుదలకు ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజు అందించాలి.విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభించే ఆకుకూరలు, పప్పు దినుసులు, సీజనల్ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి. 6 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రతిరోజు క్రమం తప్పకుండా బాలామృతం తినిపించాలని సూచించారు.ఈ వేడుకల సందర్భంగా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోషకాహార అవగాహనపై వీధుల్లో ర్యాలీ నిర్వహించి, హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి. గంగవ్వ పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఎంపీపీఎస్ హెచ్ఎం ప్రశాంత్, అంగన్వాడీ టీచర్ యశోద ,తల్లులు, కిశోర బాలికలు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అపోహలు వీడండి
సకాలంలో పరీక్షలు చేయించుకోండి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాల టౌన్,ప్రభాత. వార్త: ఎయిడ్స్ పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని, సకాలంలో పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీనివాస్ పిలుపునిచ్చారు.నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ గురువారం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లె సిద్దులు జన జాగృతి కళాజాత కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీమ్ నెం 2 కళాకారులచే జగిత్యాల వీక్లీ బజార్ లో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవి సోకినంత మాత్రాన జీవితం ముగిసినట్లు కాదని, ముందు జాగ్రత్త, అవగాహన చాలా ముఖ్యమన్నారు. హెచ్ఐవి ప్రధానంగా నాలుగు కారణాల వల్ల వ్యాపిస్తుందని, సురక్షితం కాని శృంగారం, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సూదులు, సిరంజిల వాడకం, హెచ్ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు, షేక్ హ్యాండ్ ఇవ్వడం వల్ల, కలిసి భోజనం చేయడం వల్ల, దోమ కుట్టడం వల్ల, ఒకే మరుగుదొడ్డి వాడడం వల్ల హెచ్ఐవి వ్యాపించదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. కళాకారులు ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ గ్రామా ల్లోకి తీసుకెళ్లాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.అనంతరం కళాకారులు బుర్ర కథ, ఒగ్గుడోలు రూపంలో హెచ్ఐవి నివారణపై పాటలు పాడి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్లు, టీఎస్ఏసిఎస్ సిబ్బంది, స్థానిక ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

▶30న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

▶ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష.

కరీంనగర్, ప్రభాతవార్త :

కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈనెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారంతో పాటు కార్యాలయ భవనాన్ని సుందరంగా అలంకరించాలని, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు.నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా భవనం పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ప్రధాన ద్వారం, కలెక్టర్ కార్యాలయం, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలతో పాటు ఇతర ముఖ్య ప్రాంగణాలను సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రతి ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.





తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

ప్రాంగణం పరిశీలనసమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాటు చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా చర్చించారు. కలెక్టర్ నూతన ఛాంబర్, సమావేశ మందిరంతో పాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక కోసం నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను కూడా మంత్రి పరిశీలించారు. హెలిప్యాడ్‌కు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో చేరుకున్న తర్వాత కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం నూతన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు.

ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బురదమయంగా రహదారులు

కరీంనగర్, ప్రభాతవార్త :



కరీంనగర్ నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి గేట్ వాల్స్ లీకేజీ అవుతున్నప్పటికీ, మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. లీకేజీల కారణంగా మురుగునీరు కలసి వస్తుండటంతో తాగునీటి నాణ్యత దెబ్బతింటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతినగర్‌లో రోడ్డంతా బురదమయం ముఖ్యంగా జ్యోతినగర్ లోని ఓల్డ్ డిఐజి బిల్డింగ్ సమీపంలో మున్సిపల్ నల్లా ఆన్ చేసిన ప్రతిసారీ తాగునీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి చేరుతోంది. నల్లాకు సంబంధించిన గేటు వాల్ సక్రమంగా పనిచేయకపోవడంతో నీరు బయటకు వచ్చి రహదారి అంతా నిలిచిపోతోంది. దీనివల్ల రోడ్డంతా బురదమయంగా మారడమే కాకుండా, పరిసరాల్లో చెత్తాచెదారం చేరి తీవ్ర అపరిశుభ్రత నెలకొంటోంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నల్లా గేటు వాల్‌కు మరమ్మతులు చేపట్టి, నీరు వృథాగా రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదు రోజుల పనిదినాల కోసం నిరసన

కరీంనగర్ బిజినెస్, ప్రభాతవార్త :



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే బ్యాంకింగ్ రంగంలోనూ ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులు గురువారం పట్టణంలోని యూకో బ్యాంక్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సెప్టెంబర్ 28 నుండి 30 వరకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తలపెట్టిన మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె, దానికి ముందు వచ్చే వారాంతపు సెలవుల నేపథ్యంలో సెప్టెంబర్ 27న ఆదివారం అన్ని బ్యాంక్ శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం అనుబంధ శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు పూర్తిస్థాయిలో పనిచేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినట్లు బుధవారం భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు పని దినాల విధానాన్ని ప్రవేశపెట్టాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. సెప్టెంబర్ 30న జరిగే బ్యాంక్ ల అర్ధ వార్షిక ముగింపు దినాలలోనే ఈ బ్యాంక్ సమ్మె జరగనుంది. నిధుల కేటాయింపు, ఖాతాలు సరిచూడటం, ట్రెజరీ కార్యకలాపాలు, ఇతర ఆర్థిక లావాదేవీలకు ఈ తేదీ అత్యంత కీలకం. ప్రజల అత్యవసర బ్యాంకింగ్ అవసరాలకు ఎక్కువ రోజులు పాటు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు, అన్ని ప్రభుత్వ రంగ బ్యాంక్ లు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ లు సెప్టెంబర్ 27 ఆదివారం నాడు సాధారణంగా పనిచేస్తాయి. సెప్టెంబర్ 28 నుండి ప్రారంభం కానున్న మూడు రోజుల సమ్మె దృష్ట్యా, తమ ముఖ్యమైన లావాదేవీలన్నింటినీ అంతకు ముందే పూర్తి చేసుకోవాలని బ్యాంక్ లు వినియోగదారులకు సూచించాయి. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు దామోదర్, వెంకటేష్, ప్రవీణ్ కుమార్, టి.రాజు, సాయి, రాకేష్, హరికృష్ణ, రవీందర్, త్రివేణి, హరీష్ పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త

వాగేశ్వరీ కళాశాలలో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ 2కె 26 ప్రారంభం

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలని గ్రామం గల వాగేశ్వరీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సీఎస్ ఈ, సీ ఎస్ ఈ డాటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు "టెక్ ఫెస్ట్ 226" గురువారం ఘనంగా ప్రారంభించినట్లు కళాశాల జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాక్టర్ జీ.నరసింహ జే ఎన్ టీ యూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ జగిత్యాల హాజరయ్యారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఇటువంటి సాంకేతికకార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వం,సృజనాత్మక ఆలోచన,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదపడుతయని అన్నారు. టెక్ ఫెస్ట్ 226లో పేపర్ ప్రజంటేషన్,ఐ టీ టెక్ క్విజ్, కోడ్ అవుట్ ఫుట్ ప్రిడిక్షన్, ఏ లోక్యూషన్, స్పీడ్ డీ బగ్గింగ్, ఏదైనా ప్రోగ్రామ్మింగ్ లాంగ్వేజ్ కోడింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, లోగో గెస్సింగ్, సాంస్కృతిక కార్యాక్రమాలు నిరకహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమం లో కళాశాల జాయింట్ సెక్రెటరీ జీ. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్,సీ. హెచ్ ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్,సీ హెచ్ శ్రీనివాస్,ఎస్ చంద్రమోళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం వద్ద ఆరేళ్లుగా భక్తులకు అన్నదానం

గాజుల కృష్ణ కుటుంబ సభ్యుల సేవలు.

.మానకొండూర్, ప్రభాతవార్త



: మానకొండూరు చెరువు కట్ట వద్ద జరిగే గణేష్ నిమజ్జనం ఉత్సవాలలో భాగంగా గత ఆరేళ్లుగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని గాజుల కృష్ణ కుటుంబ సభ్యులు నిర్వహిస్తూ సేవ భావాన్ని చాటుకుంటున్నారు. కరీంనగర్ పట్టణానికి చెందిన కళ్యాణ్ టైమ్స్ కమ్యూనికేషన్ అధినేత గాజుల పద్మావతి కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఎస్ ఆర్ ఆర్ ఫైర్ వర్క్స్ తడుపునూరి సుధాకర్ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తూ సేవలు అందిస్తున్నారు. భక్తులకు ఆహారం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవతో పాటు మానవతా విలువలను చాటుతున్న అన్నదాత నిర్వాహకులను పలువురు మండల ప్రజలు అభినందించారు. గణేష్ నిమజ్జనానికి కరీంనగర్ పట్టణం నుండి, మానకొండూరు మండలం వివిధ గ్రామాలలో నుండి చెరువు కట్ట వద్ద జరిగే గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఆకలితో అల్లాడించవద్దని భక్తుల ఆకలిని తీర్చడమే తమ లక్ష్యంగా ఆరేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, భవిష్యత్తులో మరింత సేవలందిస్తామని గాజుల కృష్ణ కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నదాన నిర్వహకులు గాజుల తరుణ్ కళ్యాణ్, ప్రతి వర్షిని, తొడుపు నూరి రాంప్రసాద్, హరి ప్రసాద్, శివ ప్రసాద్, కృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి.....

ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27వ ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు, తెలంగాణ ఉద్యమం, చేనేత రంగం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోనున్నట్లు గాదే గుణసాగర్ తెలిపారు.బాపూజీ జయంతి కార్యక్రమానికి 33 జిల్లాల నుంచి చేనేత, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, బీసీ సంఘాల నాయకులు, బీసీ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.చేనేత బలమే తెలంగాణ బలం ,చేనేత వృత్తిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమాన్ని గూడూరు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి చేనేత, బీసీ, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు అర్పించాలని ఆలయ ఫౌండేషన్ తరఫున ఆయన కోరారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద కి ఘన సన్మానం...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

హైదరాబాద్ బుద్ధ భవన్ లో రెండవసారి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గా నేరెళ్ల శారద రెండవసారి పదవి బాధ్యతలు స్వీకరించిన



సందర్భంగా ఇల్లందకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు,మడిపల్లి గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల(పసుల) తిరుమల వెంకటేష్‌జమ్మికుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం,డీసీసీ కార్యదర్శి మ్యాకమల్ల అశోక్,వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానం చేసి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెమెంటో, ముత్యాల తలంబ్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవం..

చలో యాదగిరిగుట్ట

కమలాపూర్: ప్రభాతవార్త.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా విజయవంతం చేద్దాం చలో యాదగిరిగుట్ట.గత తొమ్మిదేళ్లుగా డాక్టర్ సీమ శ్రీనివాస్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం ఫోరం అనేక పోరాటాలు చేసింది. ఆ పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమాన్ని చేర్చడంతో పాటు, కేకే కమిటీని ఏర్పాటు చేసింది. త్వరలోనే వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడాన్ని మేము స్వాగతిస్తున్నామని నాయకులు తెలిపారు.ఈ నేపథ్యంలో 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ వేడుకలకు కమలాపూర్ మండలం నుంచి ఉద్యమకారులు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కమలాపూర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు మోటం సంపత్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తుమ్మ శోభన్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వబ్బు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి, మాదన్నపేట సర్పంచ్ కత్తి రమేష్, కనుకుంట్ల అరవింద్, వలిగే సాంబారావు, పాక కుమారస్వామి, పచ్చిమట్ల కుమార్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.



శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా కొమ్ము నాగరాజు

కమలాపూర్: ప్రభాత వార్త.

కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోనిశ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కొమ్ము నాగరాజు, ఉపాధ్యక్షుడిగా నరిగె రాజు, ప్రధాన కార్యదర్శిగా జక్కు అంజి, క్యాషియర్ గా భాషబోయిన రాజేందర్,



ముఖ్య సలహాదారుగా బీరకుంట్ల రాజు, ఈవెంట్ మేనేజర్ గా జక్కు రాజకుమార్ లను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కొమ్ము నాగరాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన యూత్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, యూత్ అభివృద్ధికి, గ్రామ అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు అందరితో కలిసి అవిశ్రాంతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు బీరకుంట్ల రమేష్, పిల్లల రాజు, కొమ్మ గణేష్, నరిగె రాజకుమార్, భాషబోయిన ప్రశాంత్,జక్కు సందీప్, సాయి, ప్రశాంత్, సురేష్, రాకేష్, సుభాష్, రమేష్, రవి, మురళి, శివ, రాజకుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు , వంకలు.

వీణవంక, ప్రభాత వార్త:

బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల్లో నుండి వరద నీరు చేరుతుండడం తో వీణవంక మండలము లో నీ చెక్ డామ్ లు వరవళ్ళు తొక్కుతున్నాయి,మండలములోని వీణవంక పొంగి పొర్లుతుంది,అంతే కాకుండా చెరువులు , కుంటలు పూర్తి స్థాయిలో నిండి పోయాయి.ఈ మండలము లోని అనే గ్రామాలకు ఎస్ ఆర్ ఎస్ పి కాల్వల ద్వారా వచ్చే నీటి ద్వారా పంటలు సాగు చేస్తుంటారు.ఇటు వాగులు, చెరువులు, కుంటలు , అటు ఎస్ ఆర్ ఎస్ పి నిండసముతో రబీ పంటకు ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హుజూరాబాద్ వార్త

జమ్మికుంట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట పట్టణంలో పాటు మండల వ్యాప్తంగా గణేష్ నిమజ్జన వేడుకలు భక్తుల భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెండు రోజులపాటు ప్రశాంతంగా జరిగాయి. జమ్మికుంట పట్టణం,మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు గణనాథుల విగ్రహాలను అందంగా అలంకరించి, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి



స్థానిక చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. మడిపల్లి గ్రామంలోని కిట్టమ్మ గుడి గల్లి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. భజన మండలి సభ్యులు, యువకులు ప్రత్యేక లైటింగ్, విద్యుత్ మెరుపులతో మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. డీజే సంగీతం, మంత్రోచ్చారణలు, నృత్యాల నడుమ అలంకరించిన వాహనాల్లో గణపతి విగ్రహాలను ఊరేగించారు.నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పర్యవేక్షి ంచింది. మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, మండల తహశీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ శాఖ అధికారులు ముందస్తుగా నిమజ్జన ప్రాంతాలైన చెరువులు, వాగుల వద్ద బారికేడ్లు, లైటింగ్ సౌకర్యం కల్పించారు.పోలీసు సిబ్బంది ఊరేగింపు వెంట ఉండి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడంతో పాటు శాంతి భద్రతలను పర్యవేక్షి ంచారు. విద్యుత్, వైద్య, పంచాయతీ శాఖల సమన్వయంతో వేడుకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అధికారుల ఈ సమిష్టి కృషి వల్ల మండల వ్యాప్తంగా నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంతరాలు లేకుండా భక్తిపూర్వక వాతావరణంలో విజయవంతమైంది.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, గణేష్ లడ్డూలను భక్తులకు వేలం వేశారు. మహిళలు కోలాటం వంటి సంప్రదాయ నృత్యాలతో అలరించగా, చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ అలరించారు.

ఎఫ్ ఎల్ ఎన్ పని భారం తగ్గించాలనీ ఎంఇఓ వినతి.

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలము లో నీ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల లో పని చేసే ప్రధానోద్యాయులకు,ఉపాధ్యాయులకు ఎఫ్ ఎల్ ఎన్ పని భారం తగ్గించి,ఉపాధ్యాయులకు బోధనకు సంబంధించిన పనులను కొనసాగించాలని గురువారం భోజన విరామ సమయంలో మండల విద్యాధికారి ఎస్ శోభా రాణి కి ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు.



వేదిక కోసం..
కళాకారుల ఎదురుచూపులు

అక్టోబరు 1న ఆత్మీయ సమ్మేళనం
40 ఏళ్లుగా కళాభవన్ కోసం నిరీక్షణ
జానపద అకాడమీ ఏర్పాటుకు డిమాండ్
సమస్యల పరిష్కారానికి సమష్టి ఉద్యమం

గోదావరిఖని, ప్రభాతవార్త: వేదికపై జానపద కళాకారుల ప్రదర్శన.. చుట్టూ ప్రేక్షకుల కేరింతలు.. కళను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చే సంస్థలు.. ఇలా ఉండాల్సిన చోట గోదావరిఖని కళాకారులకు నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూపులే మిగిలాయి. ప్రతిభ ఉన్నా ప్రదర్శనలకు సొంత వేదిక లేకపోవడంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కళాభవన్ నిర్మించాలని వారు కోరుతున్నారు.కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, సంస్థ గౌరవ సలహాదారు, ఇప్టా జాతీయ సమితి సభ్యుడు కే.స్వామి కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల కళాకారులతో అక్టోబరు 1న దేవునిపల్లి లక్ష్మీనరసింహాస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నాలుగు దశాబ్దాలుగా..

గోదావరిఖనిలో కళాభవన్ నిర్మించాలని సుమారు 40 ఏళ్లుగా ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు, అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నా కార్యరూపం దాల్చలేదని సంకె రాజేష్ తెలిపారు. కళాభవన్ కోసం ఎదురుచూస్తూ



పలువురు ప్రతిభావంతులైన కళాకారులు కాలం చేయడం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కళాభవన్ నిర్మించాలని కోరారు. స్థానిక కవి, రచయిత లేదా కళాకారుడి పేరు పెట్టాలని సూచించారు.

సమ్మేళనానికి పిలుపు తారా ఆర్ట్స్ అకాడమీ 2018 జనవరిలో హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో ప్రారంభమైందని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలోని శాస్త్రీయ, జానపద కళాకారుల ప్రతిభను గుర్తించి పలు వేదికలపై పరిచయం చేస్తున్నామని చెప్పారు. పీవీ నరసింహారావు శతజయంతి, నల్లవజ్రం పురస్కారాలతో కళాకారులను సత్కరిస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబరు 1న జరిగే సమ్మేళనానికి పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల కళాకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కళాకారుల సమస్యలను రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లేందుకు వారిని సమ్మేళనానికి ఆహ్వానించినట్లు తెలిపారు.సమావేశంలో తారా ఆర్ట్స్ అకాడమీ బాధ్యులు పెద్దుల శ్రీనివాస్, చల్లా ప్రవీణ్‌కుమార్, శేఖర్, సీనియర్ కళాకారులు దామెర శంకర్, మేజిక్ రాజా, చంద్రపాల్, కుమార్ పటేల్, గురుమూర్తి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ
విభాగంలో అరుదైన వైద్యం..

21 రోజుల పాటు సేవలు అందించి డిశ్చార్జ్

పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ఎస్ ఎన్ సీ యూ విభాగంలో అరుదైన వైద్యం అందించి 1.5 కిలోల శిశువుకు పునర్జన్మ ప్రసాదించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా మైదంబండ గ్రామానికి చెందిన ఒక గర్భిణీకి నెలలు నిండకముందే, 8వ నెలలో ప్రసవ నొప్పులు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం జరిగింది. ముందస్తు ప్రసవం కావడంతో తక్కువ బరువుతో జన్మించిన మగ శిశువును తదుపరి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రి, పెద్దపల్లిలోని ఎస్ ఎన్ సీ యూ/ ఎన్ ఐ సీ యూ విభాగానికి తీసుకువచ్చారు. శిశువు 1 కిలో 500 గ్రాముల బరువుతో జన్మించడంతో పాటు, ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. శిశువుకు తక్షణమే సీపీఏపీ పరికరం ద్వారా శ్వాస సహాయం అందిస్తూ ప్రత్యేక వైద్య చికిత్స ప్రారంభించడం జరిగింది. 4 రోజుల పాటు సీపీఏపీ సహాయం అందించిన అనంతరం, పరిస్థితిని బట్టి నాసల్ ప్రాంగ్స్ ద్వారా ఆక్సిజన్ అందించారు. శిశువు ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడడంతో పాటు బరువు పెరగడం కోసం కేఎంసీ (కంగారూ మదర్ కేర్) అందించారు. తల్లిపాలను అవసరమైన విధంగా అందిస్తూ శిశువు పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అయితే, నెలలు నిండకముందే జన్మించడం, తక్కువ బరువు కారణంగా తల్లిపాలు సరిగా జీర్ణం కాకపోవడంతో శిశువుకు ఇన్ఫెక్షన్ ఏర్పడి కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, శిశువుకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లను అందుబాటులోకి తెప్పించి, సుమారు 10 రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణతో చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శిశువుకు 21 రోజుల పాటు నిరంతరం సేవలందించి, ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ అయ్యేలా కృషి చేసిన ఎస్ ఎన్ సీ యూ పీడియాట్రిక్ వైద్య బృందం డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ రవీందర్, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ సమత, డాక్టర్ రవి రాజా, డాక్టర్ అనుషా రెడ్డిలను, నర్సింగ్ సిబ్బంది, సపోర్టింగ్ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఆసువత్రి, పెద్దపల్లిలో ముందస్తు ప్రసవాలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఎస్ ఎన్ సీ యూ ద్వారా సుమారుగా ఇప్పటికీ 1,100 మంది శిశువులకు చికిత్స అందించడం జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు.





సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి
మధ్యవర్తిత్వం అద్భుత అవకాశం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత
కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా మధ్యవర్తిత్వంతో న్యాయం..
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత సేవలు

పెద్దపల్లి, ప్రభాతవార్త: సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అద్భుత అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కుంచాల సునీత పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సివిల్ లేదా క్రిమినల్ కేసులైనప్పటికీ, ఇరువర్గాలు రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఒక ఉత్తమ ప్రత్యామ్నాయ మార్గమన్నారు. పూర్వం మన పల్లెల్లో పెద్దల సమక్షంలో కూర్చుని సమస్యలను ఎలా అయితే సర్దుబాటు చేసుకు నేవారో, అదే పద్ధతిలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుకు వచ్చే ఇద్దరు వ్యక్తుల మనస్తత్వాన్ని, వారి సమస్యను లోతుగా అర్థం చేసుకుని, ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో రాజీ కుదిర్చి కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యాక్సిడెంట్ కేసులకు సంబంధించి ఇన్సూరెన్స్ లేని చోట, యజమానులతో మాట్లాడి త్వరితగతిన సెటిల్మెంట్ చేసి బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా కేసులను పరిష్కరించుకోవడానికి ఎవరికీ ఎలాంటి ఆర్థిక భారం ఉండదని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఈ సేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిక్షణ పొందిన 20 మంది ప్రత్యేక అడ్వకేట్లు మధ్యవర్తులుగా అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా మధ్యవర్తిత్వంతో తక్షణ న్యాయం పొందవచ్చని, ప్రజలం దరూ సంవత్సరాల తరబడి కాలం, డబ్బు వృథా చేసుకోకుండా, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న ఈ మధ్యవర్తిత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వంగర భవాని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి శ్రీనిజ కోహిర్కర్, కోర్టు సూపరింటెండెంట్ శేఖర్ తదితరులున్నారు.





పెద్దపల్లి వార్త



టీబీ రహిత రాష్ట్రంగా నిలవాలి..

పెద్దపల్లి, ప్రభాతవార్త: టీబీ రహిత రాష్ట్రంగా నిలవడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సీనియర్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతి అన్నారు. గురువారం పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎనఎస ఎస్ ఫార్మేషన్ డే, టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ రాకుండా, టీబీ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నటువంటి అవగాహన సదస్సులో భాగంగా గతంలో టీబీ మందులు వాడిన వారు, వారి కుటుంబ సభ్యులు, 60 సంవత్సరాల వయసు పైబడిన వారు, ఎత్తుకు తగ్గ బరువు తక్కువ ఉన్నవారు, మద్యం సేవించేవారు, అధికంగా సిగరెట్, బీడీ, చుట్ట, తంబాకు తినేవారు. 15 రోజులకు మించి తెమడతో కూడిన దగ్గు, జ్వరం ఉన్నవారు నేరుగా ఎక్స్ రే, పుటం పరీక్ష చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ జే.రవీందర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అనేది ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థు లు తమ పాఠ్యాంశాలతో పాటు సమాజసేవలో పాల్గొనేలా ప్రోత్స హించడం, సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యతగా వ్యవహరించడం, నాయ కత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, నాట్ మీ బట్ యూ అనే నినాదం తో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యా ర్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఏ. సమద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్‌లు, విద్యార్థులున్నారు.

నేత్రదాత గెల్లు సంస్మరణ సభ..

ఓదెల, ప్రభాతవార్త: నేత్రదాత గెల్లు లక్ష్మి సంస్మరణ సభను గురువారం ఓదెల మండల కేంద్రంలో ఆమె నివాసంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేరుగు భీష్మాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బంధుమిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించి, దానంపై ఉన్న అపోహలను తొలగించేలా వివరించారు. గెల్లు లక్ష్మి నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన ఆమె కుమారులు గెల్లు మల్లేష్-రాజేశ్వరి, గెల్లు శ్రీనివాస్-రేఖ దంపతులతో పాటు మనుమలు, మనుమరాళ్లకు సదాశయ ఫౌండేషన్ జ్ఞాపికలను కార్యక్రమానికి అతిథులుగా పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, వంగ రాయమల్లు జ్ఞాపికలను అందజేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు క్యాతం మల్లేశం లక్ష్మీకి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

కౌన్సిల్ అజెండాపై ఎమ్మెల్యే సమీక్ష

గోదావరిఖని,ప్రభాతవార్త: రామగుండం నగర అభివృద్ధి ప్రతిపాదనలు, డివిజన్లలో సమస్యలపై ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్‌ఠాకూర్ కార్పొరేటర్లతో సమీక్షించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శుక్రవారం జరగనున్న రామగుండం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో అజెండాలోని అంశాలు, ప్రజా సమస్యలపై కార్పొరేటర్ల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఎండీ ముస్తఫా, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సహకార సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త: స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా గురువారం కాట్నపల్లి, కోనేరుపల్లి గ్రామాలలో ప్రజల భాగస్వామ్యం తో శ్రమ దానం కార్యక్రమం లో పాల్గొన్న సహకార సంఘాల చైర్మెన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నీ ప్రజలు ఎవ్వరు ఉపయోగించరదని, వాటి స్థానం లో జ్యూట్ బ్యాగ్స్ వినియోగించాలని ఇంటి నుండి నాలుగు రకాల చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ కి అందించాలని,బహిరంగ ప్రదేశాల్లో ఎవరు చెత్త వేయకూడదని తెలిపారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం తో నే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం సాధ్యం అవుతుందని గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన జలసిరి పనులు చేపట్టి ఎల్నినో పరిస్థితుల నుండి బయట పడాలని ప్రజలని కోరారు మహిళా సంఘాల సభ్యులు సహకార సంఘాల చైర్మన్ సన్మానించారు. ఈ



కార్యక్రమం లో కాట్నపెల్లి సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, కోనేరుపల్లె సర్పంచ్ కాను వేణుగోపాల రాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాలరావు, ఐకెపి ఎ పి ఎం వాణిశ్రీ , ఉపసర్పంచ్ గన్ను నరేందర్ రెడ్డి ఇరు గ్రామాల పాలక వర్గ సభ్యులు, మహిళ సంఘాల సభ్యులు అధిక మొత్తం లో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పోషకాహారాలతో రోగాలకు దూరం

మన అంగన్వాడి మనందరి బాధ్యత

జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్

మల్యాల ,ప్రభాతవార్త: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత వంటి అలవాట్లతో రోగాల భారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు, గురువారం మండలంలోని ముత్యంపేటలో పోషణ మాసం లో భాగంగా మన అంగన్వాడీ మ్ననదరి బాధ్యత అంశంపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు, రోగాలు రాకుండా నీటిని ఎక్కువ తీసుకుని, ఆకుకూరలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని, పిల్లలకు సకాలంలో టీకాలను వేయించి, పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలని సూచించారు, పోషకాహారం పై నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలిచిన తల్లులకు బహుమతులను అందజేశారు, కార్యక్రమంలో పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మధు, సర్పంచ్ ఆదిరెడ్డి, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, సిడిపిఒ వీరలక్ష్మి, సూపర్వైజర్ శారద, పంచాయతీ కార్యదర్శి శేఖర్, అంగన్వాడి టీచర్లు శోభ రాణి ,గంగా ,శారద, మమత, పద్మ పాల్గొన్నారు,

ఘనంగా గణనాథుల నిమజ్జనాలు

మల్యాల, ప్రభాతవార్త: తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న ఘననాథుల నిమజ్జనాలు మల్యాల మండలంలో ఘనంగా జరిగాయి, బుధవారం సాయంత్రం నుండి మొదలైన నిమజ్జనాలు గురువారం వరకు భారీ వర్షంలో కొనసాగాయి, ఈసారి అనేక చోట్ల భారీ వినాయక విగ్రహాలు నెలకొల్పడంతో విభిన్నమైన రీతిలో అలంకరణ, ప్రత్యేక కార్యక్రమాలతో పూజలను ఘనంగా నిర్వహించారు,కాగా నిమజ్జనం శోభయాత్ర కూడా భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు, ఎత్తైన విగ్రహాల వల్ల పట్టణంలోని అనేక చోట్ల విద్యుత్ తీగలు అంతరాయం కలగడం వల్ల శోభా యాత్ర ఆలస్యంగా కొనసాగింది, నిమజ్జనానికి వినాయకుల తరలింపులో యువకులు ఉత్సాహంగా డీజే సౌండ్ ముందు నృత్యాల తో సందడి చేశారు,

విజయవంతంగా గణనాథుల నిమజ్జనం

చొప్పదండి,ప్రభాతవార్త: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కి, కౌన్సిలర్లందరికీ, మున్సిపల్ కమిషనర్ కి మున్సిపల్ సిబ్బంది అందరికీ పోలీస్ అధికారులు, ఫైర్ అధికారులకి మరి ప్రత్యేకం గా శానిటైజేషన్ సిబ్బంది కి హృదయపూర్వక ధన్యవాదాలు. అందరి సహకారం, సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగింది. ప్రత్యేకంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చైర్ పర్సన్ వడ్నూరి సరిత శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కమిషనర్ నాగరాజు, తాసిల్దార్ నవీన్ కుమార్, కౌన్సిలర్లు, జిల్లా అర్చన శ్రవణ్ కుమార్, కనుమల్ల రాజశేఖర్, వడ్నూరి అనూష శ్యాంసుందర్, ఒలుగొత్తుల సురేష్, కొత్త సుమలత గంగారెడ్డి, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజిత్ రెడ్డి, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి, జిట్ట మంగ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.





నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్

ప్రతి ఒక్కరు సాధించాలి : కందగట్ల సురేష్

చొప్పదండి,ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థి తప్పకుండా నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్ సాధించాలని ఆలూరు ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ మేరకు గురువారం యూత్ ఫర్ సేవా సంస్థ వారు 2026 నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష రాయు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్నకొండ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా యన్. యం. యం.ఎస్. గైడ్లు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం 8 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టగా ఆరు గైడ్లు ఇచ్చినారు. యూత్ ఫర్ సేవా సంస్థ వారి క్యాప్షన్ ఇవ్వడంలో ఉన్న ఆనందం తీసుకునే దానికంటే ఎక్కువగా ఉంటుదని తెలుపుతూ, ప్రతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని ఉన్నత రంగాలలో స్థిరపడాలని, వారి అభివృద్ధి కోసం యూత్ ఫర్ సేవా సంస్థ ఎప్పుడు ముందుంటుందని యూత్ ఫర్ సేవా సంస్థ వరంగల్ చాప్టర్ కందగట్ల సురేష్ ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల వడ్డేపల్లి జిల్లా హనుమకొండ తెలిపారు. ఈ పుస్తకాలు మన విద్యార్థులకు రావడంలో ప్రధాన కీలక పాత్ర వహించి నందులకు దులకు గాను విద్యార్థిని విద్యార్థులు ,పాఠశాల ఉపాధ్యాయులు యూత్ ఫర్ సేవా సంస్థ వరంగల్ చాప్టర్ కందగట్ల సురేష్ కి యూత్ ఫర్ సేవా సంస్థకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడిపల్లి లక్ష్మణ్ కుమార్ ఉపాధ్యాయులు కాని గంటి రాజమోళి, గంగాధర్, ప్రార్థన, అనిత, మీనాక్షి, కిషన్, విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేసినారు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ యూత్ ఫర్ సేవా సంస్థ వారు కోరిన విధంగా అందరూ నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్ సాధించే విధంగా కృషి చేయాలని కోరినారు. నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్షిప్ నాలుగు సంవత్సరాలు రూపాయలు 12 వేలు చొప్పున తీసుకోవాలని ఆశాభవం వ్యక్తం చేశారు.

కొండగట్టులో పవిత్రోత్సవాలు ప్రారంభం

మల్యాల ,ప్రభాతవార్త; ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో పవిత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి, మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ జరగగా, గురువారం ఉదయం ఆలయ ఈవో అంజన రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ జరిపి పవిత్రలతో ఆలయం నుండి యాగ శాల వరకు మంగళ వాయిద్యాలు తో తరలించారు, ఈ సందర్భంగా, యాగశాలలో ప్రత్యేక పూజ,హోమ కార్యక్రమాలను నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ ఆదిరెడ్డి, ఆలయ అధికారులు పలువురు నాయకులు పాల్గొన్నారు,



చొప్పదండి వార్త





జనసిరితో కళకళలాడుతున్న కుంటలు

మల్యాల, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావంతో రైతుల వ్యవసాయ భూములలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన జలసిరి కార్యక్రమం ద్వారా చేపట్టి ననీటి కుంటలు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరి జల కళ సంతరించింది, మల్యాల మండలంలో ఇప్పటివరకు 15 గ్రామాల్లో జలసిరి కార్యక్రమం ప్రారంభించగా, 37 చోట్ల వి జి బి రామ్ జి ఆధ్వర్యంలో కూలీలతో కుంటల పనులు ప్రారంభించగా, 18 ఫామ్ పాండు లు పూర్తయ్యాయి, మేడంపల్లి, ఓబులాపూర్, మానాల, ముత్యంపేట తదితర గ్రామాల్లో జల సంరక్షణ కోసం తవ్వినకుంటలు భారీ వర్షాలకు నీరు చేరి కళకళలాడుతున్నాయి, ఎల్ నినో కరువు ఎదుర్కొనేందుకు రైతులు తమ భూముల్లో ఫాం పాండు ద్వారా నీటిని సంరక్షించుకొని భూగర్భ జల వనరులు పెంచుటకు ముందుకు రావాలని ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాస్ కోరారు,

అంజన్న ఆలయంలో

కూలడానికి సిద్ధంగా పురాతన బిల్డింగ్

తొలగించకుంటే భక్తులకు ప్రమాదమే!



మల్యాల, ప్రభాతవార్త; ప్రముఖ పుణ్యక్షేతం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం లో పురాతనమైన భవనం శిథిలావస్థకు చేరుకొని ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొంత భాగం గోడకూలి పోయింది, దీంతో భవనం బలహీనమై ఏ క్షణాన కూలిపోయి ప్రమాదానికి దారి తీస్తుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు, కొండగట్టు వాహన పూజ కేంద్రం సమీపంలో ఉన్న ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఈ బిల్డింగ్ వినియోగంలో లేనప్పటికీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది, దీంతో గోడ కూలిపోగా భవనం కూడా కూలడానికి సిద్ధంగా మారిందని భక్తులు ఆందోళన చెందుతున్నారు, నిత్యం వేలాది భక్తులతో పాటు వాహన పూజల కేంద్రం పరిసరాలు కూడా రద్దీగా ఉంటాయి, ఈ భవనం ఏ క్షణాన కూలి ప్రమాదం సంభవిస్తుందోనని , ఆలయ అధికారులు తక్షణమే ప్రమాదం జరగకముందే జాగ్రత్త పడి భవనాన్ని తొలగిస్తే మంచిదని బిజెపి నాయకులు పొన్గంటి రమేష్ అధికారులను కోరారు,

యూత్ సభ్యులకు లాల్చిలు , కుర్తాలు అందజేత.....

రామడుగు, ప్రభాతవార్త : రామడుగు మండల కేంద్రంలో ని బాలామిత్ర యూత్ సభ్యులకు వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్ గురువారం కుర్తా, లాల్చీలు, అందజేశారు.దానికి బాలామిత్ర యూత్ సభ్యులు ఇలాంటి మరెన్నో సహాయక కార్యక్రమాలు చేయాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పూరెల్ల శేఖర్, సయ్యద్ ముస్తాక్, ఖదీర్, వెంకటేష్, షోయబ్ ఖాన్, పెసరి రి అజయ్. హనీఫ్,ముష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆరు నెలలుగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం పనులు

అనంతపల్లిలో అసంపూర్తిగా నిర్మాణం

చిన్నారులకు ఇబ్బందులు

బోయిన్ పల్లి ప్రభాత వార్త

బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తికాకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది.అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించేందుకు నిర్మిస్తున్న భవనం ఇలా అసంపూర్తిగా ఉండటం పట్ల వారు ఆందోళన వ్యక్తం



చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

వర్షంతో ఇబ్బందులు

చందుర్తి : ప్రభాతవార్త

చందుర్తి మండలంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తులతో విశిష్ట పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యలను బుధవారం నిమజ్జనానికి తరలగా భారీ వర్షం నేపథ్యంతో నిమజ్జనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో గురువారం ఉదయం నుండి గణపయ్యను నిమజ్జనానికి తరలించారు . గణపతి బొప్పా మోరియా అంటూ యువకులు కేరింతల మధ్య గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లారు.భారీ ర్యాలీగా తీసుకువెళ్లి స్థానిక చెరువుల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. బుధవారం వర్షం కురవడంతో కొన్ని వినాయకులను గురువారం వరకు నిమజ్జనం చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



జరగకుండా చందుర్తి సిఐ రవీందర్. ఎస్సై జిల్లేల రమేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చందుర్తి లో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు బాసెట్టి భాస్కర్, మర్రిగడ్డలో సర్పంచి దూది మనిషా శ్రీనివాసరెడ్డి. మాజీ ఎంపీపీ తిప్పని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పాల్గొన్న బి. ఆర్. ఎస్ నేతలు

బోయిన్ పల్లి ప్రభాత వార్త

పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో దుండ్రపల్లి గ్రామంలోని వారి ఇంటి ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మహమ్మద్ రషీద్‌మొక్కలు నాటారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినీపల్లి మండలం దుండ్రపల్లి గ్రామంలోనీ వారి కుటుంబ సభ్యులు మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి మొక్క నాటిన యూత్ నాయకులు మహమ్మద్ రషీద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నా జన్మదినన్ని పురస్కరించుకోనీ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ గారు చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటడం సంతోషంగా ఉందని తెలిపారు ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి పర్యావరణానికి



తోడ్పడాలని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్,బత్తిని కమల్ గౌడ్, కన్నం సాగర్, తొంటి మధుకర్, వంగ రవి, సందీప్ రెడ్డి,గుర్రం అజయ్,బాచు మల్లికార్జున్, మంద నరేష్, చెరుకు భుమేష్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లిలో వెలుగులు.. ప్రజలకు ఊరట

బైపాస్ నుంచి పోచమ్మ ఆలయం మీదుగా స్మశానం వరకు విద్యుత్ సౌకర్యం

వేములవాడ రూరల్ : ప్రభాతవార్త

వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో సర్పంచ్ లాస్య-ప్రణీత్ మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో వీధి విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరుస్తూ సింగిల్ ఫేజ్, డబుల్ ఫేజ్ విద్యుత్ లైన్లతో పాటు స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు. మర్రిపల్లి బైపాస్ రోడ్డు నుంచి పోచమ్మ ఆలయం మీదుగా స్మశానం వరకు ఈ సౌకర్యాన్ని కల్పించడంతో ఆయా ప్రాంతాల్లో రాత్రివేళ మెరుగైన వెలుతురు అందుబాటులోకి వచ్చింది.దీంతో రాత్రి సమయాల్లో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ముఖ్యంగా పోచమ్మ ఆలయం,



స్మశానం వైపు వెళ్లే ప్రజలకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా మారింది.ఈ విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ లాస్య-ప్రణీత్ మరియు పాలకవర్గ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు, సెస్ సిబ్బందికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సర్పంచ్, పాలకవర్గం చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందించారు.

ప్రజల్లో కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది: చల్మెడ

వేములవాడ ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో కౌంట్‌డౌన్ ప్రారంభమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. 34 నెలల పాలనలో వేములవాడ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.రైతులు సాగునీరు, విద్యుత్, యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మల్కపేట రిజర్వాయర్‌కు మరింత నీటిని నింపి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. యూరియా పంపిణీలో జిల్లాను యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు.రుద్రంగిలో 30 పడకల ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంపై ఎమ్మెల్యేను ప్రశ్నించారు. రాజన్న ఆలయ అభివృద్ధి విషయంలోనూ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు.బీఆర్ఎస్ నేతలను విమర్శించే బదులు ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని చల్మెడ



సూచించారు. వేములవాడ శివునితో ఆటలు వద్దని ప్రజల్లోకి వచ్చి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని అన్నారు. సిరిసిల్ల కేటీఆర్ అడ్డా అని పేర్కొంటూ బీఆర్ఎస్ తెలంగాణలో తిరిగి బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రాజు, బిఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏష తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మండ్లు, మాజీ కౌన్సిలర్ విజయ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడ వార్త

నేడు చందుర్తి మండలం లో ప్రభుత్వ విప్ పర్యట

చందుర్తి : ప్రభాతవార్త



చందుర్తి మండలంలో శుక్రవారం ప్రభుత్వ విప్. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటిస్తున్నట్లు చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొట్టే ప్రభాకర్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలో పెరిక కళ్యాణ మండపంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం తో పాటు నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఈనెల 30వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం.జన సమీకరణ కోసం మండల నాయకులు. కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలో అన్ని గ్రామాల నుండి నాయకులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు,

పోషణ మాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ

చందుర్తి : ప్రభాతవార్త

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ చందుర్తి మండల సూపర్వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం దేవుని తండా గ్రామంలో



అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలను చిన్నారులు. గర్భిణీలు. బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం పోషణ మాసం ప్రాముఖ్యత పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏఎంసీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు ఆయేషా ఆరోగ్య సిబ్బంది. పిల్లల తల్లులు పాల్గొన్నారు,

హనుమాన్ నగర్ లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



బోయిన్ పల్లి ప్రభాత వార్త

హనుమాన్ నగర్ లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాట లతో డప్పు చప్పులతో ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందనున్న జి.ఎం కు ఆత్మీయ సన్మానం

రామగిరి ప్రభాతవా

రామగుండం ఆర్‌జీ3 జి.ఎం కార్యాలయంలోగురువారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ సవిత దంపతులను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ తిరుమల దంపతులు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వెంకట లక్ష్మి దంపతులు, ఏరియాలోని వివిధ గనుల, విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎ.మనోహర్ సింగరేణి సంస్థలో 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో, అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో



ఎస్పీటుజిఎం యం.రామ్మోహన్, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, జె. రాజశేఖర్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, సి.జె.సురేఖ, బి.సుదర్శనం, రవి కుమార్, జి.లక్ష్మీనారాయణ, అప్సర్ పాషా, కళ్యాణ్ చక్రవర్తి, షబ్బీరుద్దీన్, రాజారవిచరణ్, ఆర్.రాజేశ్వరి, ఆసిఫ్ యాసిన్, మేనేజర్లు రావుల పాపయ్య, భరత్ కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కృష్ణ నగర్ గణపతి శోభయాత్ర

పాల్గొన్న సర్పంచ్ నల్లమోహన్



బోయిన్ పల్లి ప్రభాత వార్త

మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం గణపతి నిమర్జనం సందర్భంగా గణపతి శోభాయాత్ర కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక కృష్ణ నగర్ గణపతి శోభాయాత్ర హుషారుగా సాగింది సర్పంచ్ నల్లమోహన్ శోభయాత్రలో పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. శివాలయం గణపతి శోభాయాత్ర ఆకట్టుకుంది. ఒగ్గుడోలు బృందం కళాకారులు చేసిన ప్రదర్శన చూపర్లకు కనువిందు చేసింది. మండల కేంద్రంలోని ప్రధాన విధులు గణపతి శోభాయాత్ర ఊరేగింపులతో కనివిందు చేశాయి..



శాంతమైన వాతావరణంలో గణేశుని నిమజ్జనం

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చోరువతో ప్రత్యేక ఏర్పాట్లు

నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్

మంథని ప్రభాతవార్త:

తొమ్మిది రోజులపాటు నిత్య భజనలతోపూజలు చేసిన గణనాథులను గురువారం భక్తులు గోదావరి నదిలో ఘనంగా నిమజ్జనం చేశారు.మంథని శివారులోని గోదావరి నదిలో బుధవారం, గురువారం భారీగా గణనాథుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించారు.కాగా వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. అదేవిధంగా నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పొడ్డాల శ్రీనివాస్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చోరువతో నిమజ్జన కార్యక్రమానికి భారీగా భక్తులు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.గణపతి విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా క్రేన్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వర్షం కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.నిమజ్జనానికి వచ్చిన భక్తులు, ప్రజల కోసం వైద్య సహాయం, త్రాగునీరు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది



సమన్వయంతో నిమజ్జన ప్రాంతంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు చైర్మన్ వివరించారు.అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో వర్షంలో సైతం గణేశుని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా ముగిసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి , పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఆర్డిఓ సురేష్, తహసిల్దార్ మహమ్మద్ ఆరీఫొద్దీన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. స్వామి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సందీప్ కుమార్ గారు, గౌతమేశ్వర టెంపుల్ చైర్మన్ గుండా రాజు తో పాటు , పలువురు నాయకులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిట్టుపల్లిలో పీఎల్ఎఫ్ఎస్ సర్వే

ప్రజలు సహకరించి సరైన సమాచారం అందించాలి

గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్

మంథని రూరల్ ప్రభాతవార్త:

మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్ సర్వే -2026) నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై విశ్వసనీయ గణాంకాలను సేకరించేందుకు ఈ సర్వే చేపడుతున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిపోద్దీన్ , ఎంపీడీవో కంకణాల శ్రీజారెడ్డిలను కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాధాన్యతను అధికారులకు వివరించారు.మూడు నెలల పాటు వివరాల సేకరసర్వేలో భాగంగా తొలిదశలో ఎంపిక చేసిన కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేస్తారు. అనంతరం ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా వివరాలను సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు.కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల



ఆదాయ వనరులు తదితర అంశాలను నమోదు చేయనున్నారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేస్తున్న గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా సేకరించనున్నట్లు తెలిపారు.సర్వే ద్వారా సేకరించే కుటుంబాల సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని గణాంక శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంథని డీపీఎస్ఓ వెంకటేశ్వర్లు, మంథని ఎంపీఎస్ఓ సంధ్యారాణి, బిట్టుపల్లి సర్పంచ్ పోగుల లావణ్య మహేందర్, ఉపసర్పంచ్ గువ్వల రాజమల్లు , వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి మర్రిపల్లి విజయ్, ఆశా వర్కర్ మంతెన కనకలక్ష్మి, కరోబార్ మంతెన రాజశేఖర్ తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ

బోయిన్ పలి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండల లోని బూరుగు పల్లి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పై బూరుగు పల్లి గ్రామ సర్పంచి పెంచాల సౌమ్య మహేష్, పాలక వర్గం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. గ్రామంలో ఎక్కడ పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నారువర్షాకాలం లో వచ్చే అనేక విష జ్వరాలకు పరిసరాల పరిశుభ్రత కారణం అవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు వారు సూచించారు.



వర్షాలతో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు వాయిదా

వేములవాడ ప్రభాత వార్త

వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరగాల్సిన రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు భారీ వర్షాల కారణంగా వాయిదా పడ్డాయి. పోటీలను అక్టోబర్ 1 నుంచి 4 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.వర్షాలతో మైదానం బురదమయంగా మారడంతో క్రీడాకారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తేదీల మార్పు సమాచారాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాల కబడ్డీ సంఘాలు, జట్లకు తెలియజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచనల మేరకు పోటీలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సోమినేని బాలు, తిరుపతి, ముస్కు మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



బోయిని పల్లి ప్రభాత వార్త

బోయిన్ పల్లి మండలం స్తంభంపల్లి గ్రామ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు గురువారం రోజున నిర్వహించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం రిటైర్డ్ ఈవో సింగిరెడ్డి లచ్చిరెడ్డి. లక్ష్మి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాస్ స్వామి గురువు బుర్ర రామకృష్ణ గౌడ్ రాములు బాబు తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ పనుల నాణ్యతపై చర్యలు తీసుకోవాలి

ధర్మపురి, ప్రభాతవార్త:

ధర్మపురి పట్టణంలోని 12వ వార్డులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ వారం రోజులకే కూలిపోయిందని ఇట్టి నిర్మాణ పనుల నాణ్యత లోపంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్,బీజేపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.పట్టణంలోని 12 వార్డులో బి ఆర్ ఎస్, బీజేపి నాయకులు గురువారం వేరువేరుగా సందర్శించి కూలిపోయిన డ్రైనేజ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకం పనులతో ప్రజాధనం వృథా అవుతోందని,పలు వార్డుల్లో నెలల తరబడి డ్రైనేజీ పనులు కొనసాగుతూ రోడ్లు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.12వ వార్డులో డ్రైనేజీ కూలిపోవడంతో బురద, మురుగునీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ఇదే వార్డులో డ్రైనేజీ నిర్మాణం కారణంగా ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇల్లు కూలిపోయిన ఘటనను గుర్తు చేశారు.ధర్మపురిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వయంగా సమీక్షి ంచాలని డిమాండ్ చేశారు.. కాంట్రాక్టర్ల పనులకు మున్సిపాలిటీకి చెందిన జేసీబీ,బ్లేడ్ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ వంటి



వాహనాలను వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, బండారి రంజిత్, ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్,చేర్నేని నర్సయ్య, చిలువేరి శ్యాం,బిజెపి నాయకులు గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నంపై కఠిన చర్యలు తీసుకోవాలి

బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

: గొల్లపల్లి మండల ఉపాధ్యాయులు

గొల్లపల్లి, ప్రభాతవార్త

:గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు ఎంపీపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న బి. ప్రశాంత్ ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గొల్లపల్లి మండల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల వేధింపులు, బెదిరింపులు, మానసిక ఒత్తిడి కారణంగానే ప్రశాంత్ ఆత్మహత్యకు యత్నించారని ఆరోపించారు. పాఠశాల తనిఖీలు, సమావేశాల పేరుతో ఉపాధ్యాయులపై అనవసర ఒత్తిడి లేకుండా, ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితుడు రాసినట్లు పేర్కొంటున్న సూసైడ్ నోట్, వాట్సాప్



సందేశాలు, పాఠశాల విజిట్ రికార్డులు, తోటి ఉపాధ్యాయుల వాంగ్మూలాలను పరిశీలించి సమగ్ర విచారణ చేపట్టాలని బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఘటనపై న్యాయం కోరుతున్న ఉపాధ్యాయులపై బదిలీలు, మెమోలు తదితర కక్షసాధింపు చర్యలు ఉండకూడదని స్పష్టమైన హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లపై తక్షణ చర్యలు తీసుకోని పక్షంలో మండలంలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవు చేపట్టనున్నట్లు తెలిపారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

.ధర్మపురి, ప్రభాతవార్త:

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో (రైతు గుర్తింపు కార్డు) తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్ కుమార్ సూచించారు. పంటల నమోదుపై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని పెద్ద నక్కలపేట, తిమ్మాపూర్, గోవిందుపల్లి, దొంతాపూర్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు ఇట్టి సదస్సులను నిర్వహించారు.వానాకాలంలో ఏడు రకాల సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ ప్రకటించిన నేపథ్యంలో డిజిటల్ పంట సర్వేలో పంట వివరాల నమోదు చేసుకోవడం కీలకమని వివరించారు. ధాన్యం కొనుగోళ్లు డిజిటల్ పంట సర్వే



ఆధారంగా జరిగే అవకాశం ఉన్నందున రైతులు తమ పంట వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెల 30 వరకు ఫార్మల్ రిజిస్ట్రీ పై అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రైతులందరూ పంట నమోదును పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.

చందోలిలో పోషణ మాసం కార్యక్రమం

విద్యార్థులకు క్విజ్ పోటీ ,కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహ

గొల్లపల్లి, ప్రభాతవార్త:

గొల్లపల్లి అంగన్వాడి సెక్టార్ పరిధిలోని చందోలి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పౌష్టికాహారం, రక్తహీనత అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారుఅలాగే కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. తల్లులు, గర్భిణులు, బాలింతలకు కూడా పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ



కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరీనా నస్రీన్ సూపర్‌వైజర్ జానకి, అంగన్వాడీ టీచర్లు గంగ లక్షి ్మ, ప్రేమలత, ఆశా కార్యకర్త రాజేశ్వరి, తల్లులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

502 మంది విద్యార్థులకు పరీక్షలు.. 24 మందికి దృష్టిలోపం గుర్తింపు

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సమితి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని 502 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 24 మందికి దృష్టిలోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో త్వరలో ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో



ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ స్వాతి, నేత్రాధికారి కె. తిరుపతి, ఫార్మసిస్ట్ శ్రీలత, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకె రవి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

భక్తి పారవశ్యంలో గణనాథుడికి ఘన వీడ్కోలు

గొల్లపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని చిలువకోడూర్ ,భీమ్రాజుపల్లి గ్రామాలలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. భీమరాజు పల్లి లో రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి గ్రామస్తులు, యువత భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.గణపతి లడ్డూ వేలంపాట భక్తుల ఉత్సాహం మధ్య సాగగా, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొమ్మన కుమార్ రూ. 2,500లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం రైజింగ్ స్టార్ యూత్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.యువతీ యువకుల నృత్యాలు, మహిళల మంగళహారతులతో గ్రామంలో శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. అనంతరం గ్రామ ఊర చెరువులో నిమజ్జనం చేశారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత గంగాచారి, ఉపసర్పంచ్ బొమ్మన రాజమ్మ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్, రైజింగ్ స్టార్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బడికి జలగండం

కనగర్తి ప్రైమరీ పాఠశాలలో నిలిచిన వరద నీరు

చదువులకు ఆటంకం విద్యార్థులకు ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

ప్రభుత్వాలు,పాలకులు మారిన సర్కారు బడికి జలగండం తప్పడం లేదు. ప్రతి వానాకాలంలో కురిసిన వర్షపు నీరంతా పాఠశాల ఆవరణలో చేరి విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకాన్ని కలిగిస్తుంది. వర్షాకాలంలో ఈ పాఠశాలకు వచ్చే విద్యార్థులు వరదనీటిని దాటుకుంటూ పాఠశాల గదులకు వెళ్లే పరిస్థితి కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంటుంది. బుధవారం రాత్రి కురిసిన వర్షపు నీరంతా పాఠశాలలో చేరి చిన్నపాటి కుంటల తయారయింది. పాఠశాలకు విచ్చేసే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆ నీటి నుండే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతి ఏటా ఈ విధంగా వర్షపు నీరజ చేరడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నప్పటికీ అధికారులు మాత్రం బడికి జలగండం నుండి తప్పించే చర్యలు తీసుకోవడంలో మాత్రం విఫలమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బడిలోకి వర్షపు నీరు రాకుండా శాశ్వత పరిష్కారం మార్గం చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

వేములవాడలో నిమజ్జనానికి వర్షం అడ్డంకి

.వేములవాడ ప్రభాతవార్త:వేములవాడ పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవాలకు వర్షం అడ్డంకిగా మారింది. రెండు రోజులుగా నిమజ్జన కార్యక్రమాలు కొనసాగగా, వర్షం కారణంగా పలుచోట్ల ఉత్సవాలు ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ భక్తులు వర్షంలో తడుస్తూనే గణనాథులను నిమజ్జనం చేశారు.వర్షం తగ్గిన సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు నిమజ్జనానికి తరలివచ్చారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, నిమజ్జన ప్రాంతాల్లో సందడి నెలకొంది. నిర్వాహకులు, భక్తులు వర్షాన్ని లెక్కచేయకుండా భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

నిబంధనలు పాటించని ఆధార్ కేంద్రాలపై కఠిన చర్యలు ఉంటాయి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: నిబంధనలు పాటించని ఆధార్ కేంద్రాలపై, సరిగ్గా డేటా సేకరణ చేయని ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటర్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆధార్ నూతన నమోదులు, మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ల పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. ఆధార్ సేవలకు సంబంధించి ప్రతి 3 నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన నూతన నమోదులు ఎన్ని, ఇంకా ఏయే ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్నాయి అనే వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ అప్‌డేట్లు, నూతన నమోదులను వేగవంతం చేయడానికి తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ప్రక్రియలో వివిధ శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోస్టల్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. సరిగ్గా డేటా సేకరణ చేయని కేంద్రాలు, నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట డేటా కలెక్షన్ రద్దు చేయడం వంటి కఠిన నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ ప్రక్రియను ముమ్మరం చేయాలని, బయోమెట్రిక్ సమర్పణ, సరైన డేటాను ఎప్పటికప్పుడు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. డేటాను సక్రమంగా సమర్పించని, నిబంధనలు పాటించని వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని, సంబంధిత శాఖల అధికారులు, పోస్టల్ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆధార్ సేవల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ రత్నాకర్, ఈడీఎం కవిత, సంబంధిత జిల్లా అధికారులు, పోస్టల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో
మర్యాదగా వ్యవహరించాలి....

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..
బాధితులకు మెరుగైన సేవలు అందించాలి....
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచర..
నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలి

సుల్తానాబాద్, ప్రభాతవార్త: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, బాధితులకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు.ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి కేసుల నమోదు, ఆన్‌లైన్‌లో వివరాల అప్‌లోడ్, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిపై ఎస్ఐ చంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు, ఇతర నేరస్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి వారి కదలికలపై నిఘా ఉంచాలని సీపీ ఆదేశించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాల ని తెలిపారు. అనంతరం స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సీపీ పరిశీలించారు. మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీవ్ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో రహదారి భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్హుల ఇంటికే చేయూత..

పెన్షన్ దరఖాస్తులపై కలెక్టర్ నజర్.....
రేగడిమద్దికుంటలో కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ

సుల్తానాబాద్, ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందేలా దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో జరుగుతున్న పెన్షన్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల ఆర్థిక, కుటుంబ పరిస్థితులను పరిశీలిస్తున్న తీరును కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు.సుల్తానాబాద్ గ్రామీణ మండల పరిధిలో వివిధ రకాల చేయూత పెన్షన్ల కోసం మొత్తం 967 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో వితంతు పెన్షన్ కోసం 476, ఒంటరి మహిళల పెన్షన్ కోసం 51, వికలాంగుల పెన్షన్ కోసం 235, చేనేత కార్మికుల పెన్షన్ కోసం 36, గీత కార్మికుల పెన్షన్ కోసం 169 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.ఇంటింటికీ వెళ్లి పరిశీలప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తుదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో నిర్ధారించేందుకు మండల స్థాయిలో ఆరుగురు అధికారులను నియమించారు.సంబంధిత అధికారులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల కుటుంబ, ఆర్థిక పరిస్థితులతో పాటు పెన్షన్‌కు సంబంధించిన అర్హతలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.ఇప్పటి వరకు 633 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది. ఈ క్రమంలో రేగడిమద్దికుంట గ్రామంలో జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనం అందేలా పారదర్శకంగా పరిశీలన చేపట్టాలని సూచించారు.26లోగా పూర్తిమండల పరిధిలో ఇంకా 334 దరఖాస్తుల క్షేతస్థాయి పరిశీలన చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల వెరిఫికేషన్‌ను ఈ నెల 26వ తేదీలోగా పూర్తి చేయనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీం పర్యటనను విజయవంతం చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్
కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష.. అధికారులకు కీలక సూచనలు



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ జిల్లా నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. నూతన కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌తో పాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రారంభోత్సవం అనంతరం నూతన కలెక్టరేట్‌లో అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకొని వారి హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు హాస్టల్ లో వసతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షిం చారు. మెనూ చార్ట్ పరిశీలించి కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను తనిఖీ చేశారు.



పెట్రోల్ డీజిల్ బంకు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలి

డిజిపిసివి ఆనందు కులేఖ రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయతలపెట్టిన పెట్రోల్, డీజిల్ బంక్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీ.వీ. ఆనంద్ కి గురువారం ఒక విజ్ఞప్తి లేఖను పంపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పట్టణం అన్ని వైపులా విస్తరించిందని, పాత బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఎలాంటి పెట్రోల్ పంపులు లేకపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం న్యూ బస్ స్టాండ్ ప్రాంతంలోనే పెట్రోల్ బంకులు అందుబాటులో ఉండటం వల్ల యావర్ రోడ్డుపై ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవు తోందని తెలిపారు. పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలంలో వాణిజ్య పరంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యం గా ఉండటంతో పాటు పోలీస్ శాఖకు,సిబ్బంది సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం గతంలోనే జిల్లా ఎస్పీ ఉన్నతాధికారుల అనుమతులు పొందారని, ప్రముఖ ఆయిల్ కార్పొరేషన్ల ద్వారా సీల్డ్ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని గుర్తుచేశారు. అయితే టెండర్ల ప్రక్రియ ముగిసినప్పటికీ పనులు ప్రారం భించడంలో జరుగుతున్న జాప్యం పట్ల వాహన దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. డీజీపీ ప్రత్యేక చొరవ తీసుకుని నిలిచిపోయిన ఈ ప్రక్రియను పునరుద్ధరించి, 2026 నాటికి బంక్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రభాత వార్త కోనరావుపేట

స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని కొనరావుపేట సర్పంచ్ మస్కూరి కాశీరామ్ అన్నారుస్వచ్ఛత హీ సేవా-2026 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామంలోని వివిధ షాపులను సందర్శించి వ్యాపారులకు స్వచ్ఛత, ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఘనవ్యర్థాల నిర్వహణ-2026 నిబంధనల ప్రకారం నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిన అవసరంపై వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భగా సర్పంచ్



మాట్లాడుతూ. గ్రామాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జింక రేవతి కరుణాకర్ వార్డు సభ్యులు చింతల

సిరిసిల్లకు యంగ్ ఇండియా స్కూల్ మంజూరు కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

..తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.

.సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేస్తూ భవన నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



మునిగేల రాజు ఆధ్వర్యంలో మండేపల్లి మోడల్ స్కూల్ లో విద్యార్థులతో కలిసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. నిధులు మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, సర్పంచ్ గాదగోని సాగర్,ప్రిన్సిపాల్ మామిళ్ల వికల్,ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సందీప్,యూత్ కాంగ్రెస్ నాయకులు చుక్క రాజశేఖర్,ఎగుర్ల ప్రశాంత్,గడ్డం మధుకర్,గుగ్గిళ్ల భరత్ గౌడ్,తిరుపతి,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలి

ఆందోళన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

ఎస్జీటీ ఉపాధ్యాయుల పై పని భారం పడడంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, వారిపై పని ఒత్తిడి తగ్గించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మహేందర్ రావు, జంగిటి రాజులు డిమాండ్ చేశారు. గురువారం కోనరావుపేట మండలం నిమ్మపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల తీవ్రమైన పని ఒత్తిడి ఉందని,తీవ్రమైన మనోవేదనకు గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పని ఒత్తిడిని తట్టుకోలేక జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశాంత్ ఆత్మహత్యాయత్నం చేయడం చాలా బాధాకరం అన్నారు.వెంటనే ప్రతీ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని,40



విద్యార్థులు దాటిన ప్రతీ పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయున్నీ కేటాయించాలని ,ఉపాధ్యాయుల నియామకం జరిగే వరకు విద్యావాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై పని బారం తగ్గించే వరకు ఉపాధ్యాయులు శాంతియుతంగా నిరసనలు తెలుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయినీ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనపై హౌసింగ్, ఎంపీడీఓలు, ఏఈలు, డీఆర్డీఓతో జిల్లా కలెక్టర్ సమీ

సిరిసిల్ల బ్యూరో , సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెండు విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణం, చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, డీఆర్డీఓ, హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో జిల్లా



సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు. జిల్లాలో ఇప్పటిదాకా 6,339 ఇండ్లకు ముగ్గు పోశామని, 5,294ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో, 4, 756ఇండ్లు గోడల లెవెల్ లో, 4,467స్లాబ్ లెవెల్ లో, 3,832 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో 289 ఇందిరమ్మ ఇండ్లు గుడిసెల్లో ఉన్న వారికి మంజూరు అయ్యాయని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కింద మంజూరు అయిన ఇండ్ల పై ఆరా తీసి.. వాటి పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఎంపీడీఓ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేయూత పెన్షన్ ప్రయోజనం అందేలా పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మైనింగ్ ఏడీ క్రాంతి కుమార్, ఎంపీడీఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై అపోహలు వద్దు

వేములవాడ ఆర్డిఓ కుమారి

పల్లిమక్తలో భూభారతి భూ సర్వే పై అవగాహన సదస్సు

భూ సర్వేపై రైతులు, ప్రజలు అపోహలకు గురి కావద్దని వేములవాడ ఆర్డిఓ కుమారి సూచించారు. గురువారంకోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో భూ భారతి - భూ రీసర్వే అంశాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డిఓ కుమారి మాట్లాడుతూ.. గ్రామాల్లో భూరి సర్వే చేయడంపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ప్రజా ప్రభుత్వంలో ఎవరికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం రైతులు, ప్రజలు



అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్, తహసిల్దార్ వరలక్ష్మి, జిల్లా అడిషనల్ సర్వేయర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్, సింగిల్ విండో డైరెక్టర్,మండల సర్వేయర్, జీపీవో, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల కొనుగోలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

ఖరీఫ్ సీజన్ లో వివిధ పంటల కొనుగోళ్ల పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ కొనుగోళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ గరిమ



అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ చివరి వారం నుంచి వరి ధాన్యం మార్కెట్లోకి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టేలా చూడాలని, అన్నిటికి జీపీఎస్ యంత్రాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కొనుగోళ్లకు అనుగుణంగా గన్ని సంచులు తెప్పించాలని సూచించారు. 4335 టార్పాలిన్లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు 2, గ్రైన్ కాలిపర్స్ 270, తేమ యంత్రాలు 333, ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు 630, హస్క్ రిమూవర్లు 270, డ్రైయర్స్ 2 ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుందని, 4 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీఎం గోపాల్, వ్యవసాయ శాఖ అధికారి అష్టల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో టాపర్‌కు రూ.లక్ష పారితోషికం

గవర్నర్ చేతుల మీదుగా బొడ్డు వర్షిణికి సత్కారం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపల్లె గ్రామానికి చెందిన బొడ్డు వర్షిణి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన శ్రీరామ్ గ్రూప్స్ సంస్థ రూ.లక్ష నగదు పారితోషికాన్ని అందజేసింది. హైదరాబాద్‌లో జరిగిన



కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వర్షిణికి ఈ పారితోషికాన్ని అందించారు. చిన్న గ్రామం నుంచి చదువులో ప్రతిభ చాటుకుని గవర్నర్ చేతుల మీదుగా సత్కారం పొందడం పట్ల గ్రామ సర్పంచ్ మీసాల కనకరాజు,గ్రామస్థులు,మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షిణి ప్రతిభ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె నిరూపించిందని అభినందించారు.

మానకొండూరులో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం.

.రెండు రోజులుగా కొనసాగిన నిమజ్జనం..

మానకొండూర్, ప్రభాతవార్త



: గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మానకొండూరు చెరువు వద్ద బుధవారం మధ్యాహ్నం నుండి కొనసాగిన గణేష్ నిమజ్జనం గురువారం సాయంత్రం సమయం ఐదు గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిమజ్జనం ముగిసింది. దీంతో మండల అధికారులు ఒక్కసారిగా ఊపిరిపించుకున్నారు. మానకొండూర్ చెరువు కట్ట వద్ద గణేష్ నిమజ్జనం ప్రతి యేటా రెండవ రోజు మధ్యాహ్నం సమయం వరకు ముగిసేది. ఈ ఏడాది గణేష్ నిమజ్జనం రోజు రాత్రి భారీ వర్షం బీభత్సవానికి గణేష్ నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలు ఎక్కడికి అక్కడనే నిలిచిపోవడంతో కొన్ని గంటలపాటు నిమజ్జనానికి అంతరాయం ఏర్పడింది. మానకొండూరు చెరువులో జరిగే గణేష్ నిమజ్జనానికి కరీంనగర్ పట్టణం, తిమ్మాపూర్, మానకొండూరు మండలంలోని వివిధ గ్రామాల నుండి చిన్న విగ్రహాలు 198, పెద్ద విగ్రహాలు 1070 నిమజ్జనం అయినట్లు తెలిపారు. మానకొండూర్ చెరువు వద్ద కు నిమజ్జనానికి తరలిరానున్న దృష్ట్యా కరీంనగర్ పురపాలక సంఘం, మానకొండూరు మండల అధికారుల ఆధ్వర్యంలో చెరువు కట్ట వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ముందస్తు చేపట్టారు. గణేష్ నిమజ్జనం రెండు రోజులపాటు కొనసాగుతూ ఏలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిమజ్జనం ముగియడంతో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, సిపి గౌస్ అలాం, డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఎసిపి విజయ్ కుమార్, పలు శాఖల అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ విజయ్ కుమార్, సీఐ శ్రీలత, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీ ఓ సతీష్ రావు, ఎస్సై తిరుపతి, విద్యుత్ శాఖ ఏఈ సత్యనారాయణ, ఆర్ ఐ లు అశోక్, ప్రీతి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జనం.



.మానకొండూర్, ప్రభాతవార్త

: మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టాపించిన గణేష్ నిమజ్జనం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గణేష్ విగ్రహానికి భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు, పురుషులు, పిల్లలు సంప్రదాయ వస్త్రాలను ధరించి నృత్యాలు చేపడుతూ ర్యాలీగా నిమజ్జనానికి బయలుదేరి మానేరు వాగులో గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాపాక జగన్ మాట్లాడుతూ గణనాధుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాపాక పెద్ద ఎల్లయ్య,ఈశ్వర్, రంగస్వామి,లక్ష్మణ్,రవీందర్,పులిపాక నరేష్, పారునంది ఎల్లయ్య,రాపాక శంకరయ్య, జంగం అజయ్, రంగస్వామి,జంగం అంజన్న, నాగరాజు, ఆంజన్న, అజయ్, పారునంది ఆంజనేయులు, రాపాక రాజేందర్, సంజయ్, హరీష్, దుర్గ ప్రసాద్, సంజయ్, శ్రవణ్, పారునంది అరవింద్, రాపాక సాత్విక్, ఆదిత్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

రువు నిండింది, మత్తడి పారుతుంది

చిగురుమామిడి, ప్రభాత వార్త

:చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామ ఊర చెరువు గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు నిండింది. మత్తడి సైతం పారుతుంది. గ్రామ సర్పంచ్ జంగ శిరీష, పాలక వర్గం సభ్యులతో కలిసి గురువారం మత్తడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మొన్నటి వరకు వర్షాలు లేక చెరువు వెల వెల బోయింది. నేడు చెరువు నిండి జలకళ సంతరించుకోవడం తో రైతులు, గ్రామస్థులు, ముదిరాజ్ లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొదటగా వినాయక విగ్రహాలు సైతం చెరువులో వేయటానికి తగినంత నీరు లేకపోవడం తో భయపడిన భక్తులు నేడు నిమజ్జనం సమయానికి చెరువు నిండటంతో నిమజ్జన ఊరేగింపు శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు.

బురదమయంగా రహదారులు

కరీంనగర్, ప్రభాతవార్త :

కరీంనగర్ నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణ లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి గేట్ వాల్స్ లీకేజీ అవుతున్నప్పటికీ, మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. లీకేజీల కారణంగా మురుగునీరు కలసి వస్తుండటంతో తాగునీటి నాణ్యత దెబ్బతింటోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జ్యోతినగర్‌లో రోడ్డంతా బురదమయం ముఖ్యంగా జ్యోతినగర్ లోని ఓల్డ్ డిఐజి బిల్డింగ్ సమీపంలో మున్సిపల్ నల్లా ఆన్ చేసిన ప్రతిసారీ తాగునీరు పెద్ద ఎత్తున రోడ్డుపైకి చేరుతోంది. నల్లాకు సంబంధించిన గేటు వాల్ సక్రమంగా పనిచేయకపోవడంతో నీరు బయటకు వచ్చి రహదారి అంతా నిలిచిపోతోంది. దీనివల్ల రోడ్డంతా బురదమయంగా మారడమే కాకుండా, పరిసరాల్లో చెత్తాచెదారం చేరి తీవ్ర అపరిశుభ్రత నెలకొంటోంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి నల్లా గేటు వాల్‌కు మరమ్మతులు చేపట్టి, నీరు వృథాగా రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఐక్యతతోనే న్యాయవాదుల సమస్యలకు పరిష్కారం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :



న్యాయవాద లోకమంతా ఒకే తాటిపైకి వచ్చే ఐక్యంగా ఉండడం ద్వారా మాత్రమే వృత్తిపరమైన సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. గురువారం కోర్టు విధులను బహిష్కరించి కోర్టు కాంప్లెక్స్ ముఖద్వారం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా సమస్యలలో ఉన్న తోటి న్యాయవాదులకు సంఘీభావంగా శాంతియుత నిరసన తెలుపుతున్నామన్నారు. వృత్తిపరమైన గౌరవం, భద్రత, మర్యాద పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత న్యాయవాదుల పైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలోబార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, కార్యవర్గం, న్యాయవాదులు పాల్గొన్నారు.

మందు అమ్మకం కాదు... ప్రజల ఆరోగ్య పరిరక్షణ

. నేడు ప్రపంచ ఫార్మసిస్ట్ ల దినోత్సవం

ఫార్మసిస్ట్ మందుల సేల్స్ ప్రమోటర్ కాదు

ప్రజారోగ్యంలో ఫార్మసిస్ట్ ల భాగస్వామ్యం రోగితో సామాజిక బాధ్యతతో మెలగాలి ఔషధ నిల్వల నిర్వహణలో జాగ్రత్తలు

డిజిటల్ యుగంలో మారుతున్న ఫార్మ

సీకరీంనగర్ హెల్త్, ప్రభాతవార్త:

మనిషి ఆరోగ్య పరిరక్షణలో వైద్యుడి పాత్ర ఎంత ముఖ్యమో, ప్రిస్క్రిప్షన్ ఆధారంగా ఫార్మసీలో రోగికి సరైన మోతాదు కలిగిన మందులు అందించడంలో ఫార్మసిస్టు పాత్ర కూడా అంతే కీలకం. వైద్యుడు వ్యాధిని గుర్తించి చికిత్సను సూచిస్తే, ఆ చికిత్సలో మందుల వినియోగం సక్రమంగా సూచించే బాధ్యతలో ఫార్మసిస్టు కీలక భాగస్వామి. మందుల పేరు, మోతాదు, వినియోగించే విధానం, సమయం, దుష్ప్రభావాలు, ఇతర మందులతో కలిగే పరస్పర ప్రభావాలపై రోగికి అవగాహన కల్పించడంలో ఫార్మసిస్ట్ సేవలు ఎంతో అవసరం. నేడు ప్రపంచ ఫార్మసిస్ట్ ల దినోత్సవంప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ ల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఫార్మసీ రంగం ఆరోగ్య వ్యవస్థలో పోషిస్తున్న పాత్రను గుర్తుచేయడం, సురక్షితమైన మందుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. బి ఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తిచేసి అభ్యర్థులు ఫార్మసిస్ట్ లగా పనిచేయడానికి అర్హులు. డాక్టర్ ఆఫ్ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు డాక్టర్ లు గా కూడా పనిచేయడానికి అర్హత సాధిస్తున్నారు. ఫార్మసిస్ట్ మందుల సేల్స్ ప్రమోటర్ కాదు

రోగితో సామాజిక బాధ్యతతో మెలగాలి

మందుల విషయంలో నాణ్యత అత్యంత కీలకం. నకిలీ, నాసిరకం లేదా గడువు ముగిసిన మందులు రోగి ఆరోగ్యానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించవచ్చు. మందుల ప్యాకింగ్, లేబుల్, బ్యాచ్ నంబర్, తయారీ గడువు తేదీలు వంటి వివరాలను పరిశీలించడం అవసరం. అనుమానాస్పద ప్యాకింగ్ లేదా మందు కనిపిస్తే వినియోగించకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడం మంచిది. ఈ భాధ్యతలను ఫార్మసిస్ట్ లు అలవారుచుకోవాలి. ఒకే మందుకు వేర్వేరు బ్రాండ్ లు, వేర్వేరు ధరలు ఉండటం వల్ల సాధారణ వినియోగదారుడికి గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. మందుల కొనుగోలులో బిల్లు తీసుకోవడం, ప్యాక్‌పై ఉన్న ధరను పరిశీలించడం, వైద్యుడు సూచించిన మందుకు ప్రత్యామ్నాయం అవసరమైతే వైద్యుడితో ఫార్మసిస్ట్ చర్చించడం అవసరం. రోగి అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అనవసరమైన మందులు, టానిక్స్, సప్లిమెంట్లు సూచించకుండా వృత్తిపరమైన నైతిక ప్రమాణాలను పాటించడం ఫార్మసీ రంగానికి అత్యవసరం.

ఔషధ నిల్వల నిర్వహణలో జాగ్రత్తలు

ఫార్మసిస్ట్ లు ఔషధ నిల్వలోనూ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. ఉష్ణోగ్రత, తేమ, వెలుతురు వంటి అంశాలకు అనుగుణంగా మందులను నిల్వ చేయకపోతే వాటి నాణ్యత ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. వినియోగదారుడు మందులు కొనుక్కున్న తర్వాత వాడకం పూర్తయ్యేంతవరకు వాటిని నిల్వ చేసే విధానాన్ని కూడా ఫార్మసిస్ట్ లు అవగాహన కల్పించాలి. మందులు కొన్న వెంటనే ఫార్మసిస్ట్ లు సరైన రీతిలో క్యారీ బ్యాగ్ లు లేదా ప్యాకింగ్ సంచులలో పెట్టి వారికి అందించాలి. డిజిటల్ యుగంలో మారుతున్న ఫార్మసీఆన్‌లైన్ ఆరోగ్య సేవలు, ఈ ప్రిస్క్రిప్షన్ లు, డిజిటల్ రికార్డులు, టెలిమెడిసిన్ వంటి సేవలు విస్తరిస్తున్న కొద్దీ ఫార్మసీ రంగంలోనూ మార్పులు వస్తున్నాయి. అయితే డిజిటల్ సౌకర్యం పెరిగినంత మాత్రాన మందుల వినియోగంలో జాగ్రత్త తగ్గకూడదు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో స్వయంగా మందులు ఎంచుకోవడం, సోషల్ మీడియాలో కనిపించే ఆరోగ్య సూచనల ఆధారంగా మందులు వాడటం ప్రమాదకరంగా మారవచ్చు. మందు కొనడం కంటే మందును సురక్షితంగా ఉపయోగించడం ముఖ్యమనే విషయాన్ని ప్రజలకు కూడా గుర్తుచేయాల్సిన అవసరం ఉంది. వైద్యుడు, ఫార్మసిస్ట్, రోగి, ఈ మూడు వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే మందు నిజమైన ఆరోగ్య రక్షణ సాధనంగా మారుతుంది.



టవర్ సర్కిల్‌లో వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

కరీంనగర్,ప్రభాతవార్త



: నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి, కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల ప్రతిమలు భారీ శోభాయాత్రలతో టవర్ సర్కిల్‌కు చేరుకున్నాయి.టవర్ సర్కిల్ వద్ద గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు కుల, మతాలకు అతీతంగా ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి ఐక్యతను చాటుతున్నాయన్నారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుడికి కడసారి దర్శనం చేసుకుని నిమజ్జనం చేయడం సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.భక్తులు, యువజన సంఘాల ప్రతినిధులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాయిని మల్లేశం కోరారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు కరీంనగర్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టవర్ సర్కిల్ ప్రాంతం గణపతి బప్పా మోరియా నినాదాలతో మార్మోగింది.

గణేష్ నిమజ్జనాలు ప్రసాదంగా ముగిశాయి

నిమజ్జనం పాయింట్లలోని విగ్రహాల

శకలాలను తొలగిస్తాం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్.

కరీంనగర్, ప్రభాతవార్త :

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసాయని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కరీంనగర్ లో గురువారం రోజు నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు.. మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట పాయింట్లను సందర్శించి సమీక్షించారు. విగ్రహాల నిమజ్జనం, క్రేన్ల పనితీరును, పారిశుధ్య పనులను పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులను నిమజ్జన గణాంకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శోభాయాత్రతో పాయింట్ల వద్దకు వచ్చిన భక్తులకు, మండపాల నిర్వాహకులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టి... వేగవంతంగా నిమజ్జనాలను ముగించేలా సూచనలు చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో మొత్తం 2252 విగ్రహాలను ఆరు పాయింట్ల వద్ద నిమజ్జనం చేయడం జరిగింది. మానకొండూర్ 850, కొత్తపల్లి 550, చింతకుంట 740, బొమ్మకల్ 62, దుర్షెడ్ 20, గోపాల్ పూర్ 30 చొప్పున విగ్రహాలు నిమజ్జనం జరిగాయి. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరపాలక సంస్థ పరిదిలో గణేష్ నిమజ్జనాలు విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన నగర ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు పాలకవర్గ సభ్యులకు, మండపాల నిర్వహాకులకు, ఉత్సవ కమిటీలకు, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ మరియు జిల్లా యంత్రాంగానికి, పోలీస్ సిబ్బందికి, ముఖ్యంగా నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రేపటి నుండి నిమజ్జనం పాయింట్లలోని విగ్రహాల శకలాలు, ఇతర వ్యర్థాలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

52 ఏళ్ల అరుణోదయంలో.. 50 ఏళ్ల విమలక్క

ప్రస్థానంహైదరాబాద్‌లో 50 గంటల పాటు ఆట పాట మాటలతో

ప్రజా కళా జాతర..కరీంనగర్‌లో

ప్రజా కళా జాతర కరపత్రాల ఆవిష్కరణ.....

కరీంనగర్, ప్రభాతవార్త :

"52 ఏళ్ల అరుణోదయంలో.. 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం" పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రోజున కరీంనగర్ నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా పూర్వ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి పటేల్, జిల్లా పూర్వ కార్యదర్శి బిజిగిరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా కళా జాతర కరపత్రాలను అరుణోదయ కళాకారులు, ప్రజాసంఘాలు, నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 52 ఏళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థానంలో 50 ఏళ్లుగా విమలక్క కొనసాగిస్తున్న ప్రజా కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ప్రజా కళా జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపం (నాగన్న ప్రాంగణంలో) ఈ నెల 26 నుంచి 28 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.50 గంటల పాటు ఆట పాట మాట ప్రజా కళా జాతరలో భాగంగా 50 గంటల పాటు వివిధ కళారూపాలు, పాటలు, ఆటలు, మాటల కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగనున్నాయని తెలిపారు.విమలక్క గత ఐదు దశాబ్దాలుగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ అనేక ధూంధాం కార్యక్రమాలు నిర్వహించి, తన పాట, మాట ద్వారా ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు. తెలంగాణ



ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సాంస్కృతిక కళాకారుల పాత్ర కూడా కీలకంగా ఉందని, పాటలు, కళారూపాల ద్వారా ఉద్యమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలు, సామాజిక చైతన్యం, ఉద్యమాల నేపథ్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకురాలు ఓల్లాల వాణి, కళాకారులు పొద్దుపొడుపు శంకర్ దుర్గం మురళి గౌడ్, పల్లె రాజేశం, వెంకటేష్ వెంకీ, గౌడ సంఘం అధ్యక్షుడు కలర్ సత్తన్న, పల్లె నారాయణ గౌడ్, కుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్, జేఏసీ నాయకుడు కోటేశ్వర్, లింగంపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి శ్రీనివాస్ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల సంపత్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సర్దార్ రణధీర్ సింగ్,ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కెమంసారం సమ్మయ్య, బీసీ సంక్షేమ సంఘం మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ అంజద్,జేఏసీ నాయకులు పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్ కొల్లిపాక శ్రీనివాస్, ఉద్యమకారుల జేఏసీ మహిళా అధ్యక్షురాలు సుహాసిని బిందు, కార్యదర్శి గడ్డం లత, తదితరులు పాల్గొన్నారు

విమలక్క కళా ప్రస్థానం ప్రజ్వలితం

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



చరిత్రలో 52 ఏళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థానంలో 50 ఏళ్లుగా విమలక్క కొనసాగిస్తున్న ప్రజా కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఆర్టీసీ కళ్యాణ మండపం లో 50 గంటల పాట, మాట, ఆటతో జరిగే ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు బొల్లం లింగమూర్తి, బిజిగిరి నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. విమలక్క ప్రజా ఉద్యమాలలో పలు రాష్ట్రాలలో, తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ధూంధాంలలో పాట, మాట ద్వారా ఉద్యమ స్ఫూర్తిని రగిలించారన్నారు. ప్రతీ ఉద్యమంలో కళాకారుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకురాలు ఓల్లాల వాణి, కళాకారులు, పలు సంఘాల నాయకులు పొద్దుపొడుపు శంకర్ దుర్గం మురళి, పల్లె రాజేశం, వెంకటేష్ వెంకీ, కలర్ సత్తన్న, పల్లె నారాయణ గౌడ్, జీఎస్ ఆనంద్, కోటేశ్వర్, లింగంపల్లి సత్యనారాయణ, గాలిపల్లి శ్రీనివాస్, పూసల సంపత్, సర్దార్ రణధీర్ సింగ్, కెమంసారం సమ్మయ్య, మహమ్మద్ అంజద్, పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్, కొల్లిపాక శ్రీనివాస్, సుహాసిని, బిందు, గడ్డం లత తదితరులు పాల్గొన్నారు

నేలపట్లలో దివిస్ ఉచిత వైద్య శిబిరం

చౌటుప్పల్ సెప్టెంబర్ 24 , ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడానికి దివిస్ లాబరేటరీ యాజమాన్యం అందిస్తున్న తోడ్పాటును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని నేలపట్ల సర్పంచ్ గంగాపురం వసంత నరేష్ గౌడ్ అన్నారు. నేలపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు డాక్టర్ జయంత్ కుమార్, డాక్టర్ నరేష్ ల నేతృత్వంలో ఉచితం వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ కేంద్రంలోని లింగారెడ్డి గూడెం గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో డాక్టర్ జయంత్ కుమార్, నరేష్ ల ఆధ్వర్యంలో 36 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా విద్యార్థులకు రూ. 80,884 విలువ గ ల2340 నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల ఉప సర్పంచ్ సి.హెచ్. బాల రాజు, వార్డు మెంబర్లు అనసూయ, శ్రావంతి, కవిత, సంజీవరెడ్డి, భార్గవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. గిరిధర్ బాబు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, ఎస్. మాధవి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఖిడివిస్ ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, జె. శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఓడిసి పెట్టాలి జెడ్పి సీఈవో శోభారాణి

చౌటుప్పల్ సెప్టెంబర్ 24 ప్రభాతవా

వర్షపు నీటిని ఒడిసి పట్టాలని తద్వారా భూగర్భ జలాలు పెరిగేందుకు దోరపడుతుందని జెడ్పి సీఈవో శోభారాణి సూచించారు. పంతంగి గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. గ్రామంలో మంజూరు అయిన ఆర్ అండ్ బి రోడ్ ను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో పనులు జరుగుతున్న పంట కుంట పంపాడు పనులను పరిశీలించడం జరిగినది. గ్రామపంచాయతీని సందర్శించారు. ఎలెన్నో ప్రభావం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ పంట కుంటలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో ఉన్న చెరువును పూడిక తీసి నీరు నిలిచే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి, ఎం.పరమేశ్వరి, శంకర్, పంచాయతీ సెక్రెటరీ పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మాజీ సర్పంచ్ అంతటి రమేష్ గౌడ్, కడగంచి చలమందరాజు, కడగంచి జనార్ధన్, పబ్బు లింగస్వామి, కడగంచి వెంకటేశం,బోయ దశరథ, ఏపీవో ఈశ్వరయ్య, ఈసి రమాదేవి, టి ఏ నీల, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత తదితరులు పాల్గొన్నారు.